మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

గురువారం THURSDAY 11-6-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 343 Issue: 343

11 జూన్ 2026 - గురువారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ(అధిక) మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:45 సూర్యాస్తమయం - సా. 6:46 తిథి ఏకాదశి రా. 10:31 వరకు తరువాత ద్వాదశి సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం రేవతి ఉ. 8:16 వరకు తరువాత అశ్విని యోగం శోభన రా. 12:540 వరకు కరణం బవ ఉ. 11:47 వరకు భాలవ రా. 10:31 వరకు వర్జ్యం రా. 2:46 నుండి తె. 4:15 వరకు దుర్ముహూర్తం ఉ. 10:05 నుండి ఉ. 10:57 వరకు మ. 3:17 నుండి సా. 4:09 వరకు రాహుకాలం మ. 1:53 నుండి మ. 3:31 వరకు యమగండం తె. 5:45 నుండి ఉ. 7:22 వరకు గుళికాకాలం ఉ. 9:00 నుండి ఉ. 10:38 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:09 నుండి తె. 4:57 వరకు అమృత ఘడియలు తె. 5:58 నుండి ఉ. 7:30 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:49 నుండి మ. 12:41 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial

## ముగ్గురు భారతీయులు గల్లంతు



### అమెరికాకు భారత్ సమన్లు జారీ

టెహ్రాన్: బుధవారం ఒమన్ తీరంలో ఓ వాణిజ్య నౌకపై అమెరికా బలగాలు జరిపిన దాడిలో 21 మంది భారతీయులను రక్షించగా.. మరో ముగ్గురు ఆచూకీ ఇంకా లభ్యం కాలేదని విదేశాంగ శాఖ ధ్రువీకరించింది. హర్మూజ్ జల సంధి వద్ద బుధవారం జరిగిన ఈ దాడిని కేంద్రం ఒక ప్రకటనలో ఖండించింది. హర్మూజ్ సమీపంలోని 'సెట్టెబెల్లో' అనే చమురు ట్యాంకర్ ఇంజిన్ భాగంపై ఒక క్షిపణి దూసుకురావడంతో నౌకలో మంటలు చెలరేగాయి. పలావు జెండా కలిగిన ఈ నౌక ఒమన్‌లోని సోహార్ ఓడరేవుకు ఈశాన్యంగా సుమారు తరువాయి 2 వ పేజీలో...

## కెనడాలో భారత సంతతి పోలీస్ హత్య



ఒట్టావా: కెనడాలో విధుల నిర్వహణలో ఉన్న భారత సంతతికి చెందిన ఒక యువ పోలీస్ అధికారి దారుణ హత్యకు గురయ్యారు. ఒక ప్రమాదకరమైన నిందితుడిని పట్టుకునే క్రమంలో జరిగిన ఈ ఘోర ఘటన స్థానికంగా తీవ్ర దిగ్భ్రాంతిని కల్గించింది. కెనడాలోని అంటారియో ప్రావిన్షియల్ పోలీస్ (ఓపీపీ) విభాగంలో కానిస్టేబుల్‌గా దేశప్రజలకు సేవలు అందిస్తున్న భారతీయ మూలాలున్న తరుణ్ బాలి ఈ దుర్ఘటనలో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కెనడా పోలీస్ ఉన్నతాధికారులు వెల్లడించిన అధికారిక వివరాల ప్రకారం.. ఒక హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న 18 ఏళ్ల యువకుడిని వైద్య పరీక్షల నిమిత్తం పోలీసులు తరలిస్తున్నారు. ఈక్రమంలోనే సదరు మైనర్ తరువాయి 2 వ పేజీలో...

## లండన్‌లో భారత సంతతి కుటుంబం దుర్మరణం



లండన్: భవిష్యత్తుపై ఎన్నెన్నో కలలు కంటూ లండన్ వెళ్లి ఓ కుటుంబం అక్కడే ప్రాణాలు కోల్పోయింది. తమ తొమ్మిదేళ్ల కుమారుడితో కలిసి హాయిగా జీవిస్తున్న దంపతులు.. అనుకోకుండా తాము ఉంటున్న అపార్ట్‌మెంట్ మీద నుంచి పడే ప్రాణాలు కోల్పోయారు. భారత సంతతికి చెందిన 47 ఏళ్ల రాకేష్ నారాయణ్ పాయ్, 46 ఏళ్ల అదితి విజయ్ పారాల్కర్‌లు భార్యాభర్తలు. అయితే వీరికి తొమ్మిదేళ్ల కుమారుడు సిద్ పాయ్ పారాల్కర్ ఉన్నాడు. వీరంతా ప్రస్తుతం దక్షిణ లండన్‌లోని ఎలిఫెంట్ అండ్ క్యాజిల్ పరిధిలోని చర్చియార్డ్ రోలో ఉన్న 'హైపాయింట్' అనే 45 అంతస్తుల విలాసవంతమైన అపార్ట్‌మెంట్ -2 వ పేజీలో...

# మాది ఫ్యూచర్!



### బీఆర్ఎస్‌ది గతమే.. ప్రతిపక్ష హోదా కూడా దక్కదు

### హైదరాబాద్‌ను ప్రపంచ ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దుతాం

### ఎఫ్‌సీడీఏ భవన ప్రారంభోత్సవంతో సీఎం రేవంత్

తెలంగాణను ప్రపంచ ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'భారత్ ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్టు వాస్తవరూపం దాల్చుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టు రాష్ట్ర భవిష్యత్తు ముఖచిత్రాన్ని మార్చబోతోందని ధీమా వ్యక్తం చేశారు.

హైదరాబాద్, జూన్ 10 (ఈవార్తలు): కేవలం 150 రోజుల రికార్డు సమయంలో ఫ్యూచర్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయ భవనాన్ని పూర్తి చేయడం ప్రభుత్వ చిత్తశుద్ధికి, వేగానికి నిదర్శనమని ముఖ్యమంత్రి తెలిపారు. రాబోయే ఎనిమిదేళ్లలో ఫ్యూచర్ సిటీని న్యూయార్క్, టోక్యో, సింగపూర్ వంటి అంతర్జాతీయ నగరాలకు దీటుగా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. 2034 నాటికి తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే లక్ష్య సాధనలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీపై ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. గతంలో హైటెక్ సిటీ, ఔటర్ రింగ్ రోడ్, జీనోమ్ వ్యాలీ వంటి ప్రాజెక్టులతో హైదరాబాద్ విస్తరించడం వల్లే ప్రపంచ పటంలో నగరానికి ప్రత్యేక స్థానం లభించిందని గుర్తుచేశారు. ప్రస్తుతం ఫ్యూచర్ తరువాయి 2 వ పేజీలో...

# ప్రజలకు టార్చర్!



### రేవంత్ అసమర్థతతో హైదరాబాదీలకు అవస్థలు

### తొలి వర్షానికే చేతులెత్తిసిన కాంగ్రెస్ ప్రభుత్వం

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం

'తొలి వర్షానికే రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్ చేతులెత్తేసింది.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసమర్థత, బాధ్యతారాహిత్యంతో నగరవాసులు నరకయాతన అనుభవించాల్సి వచ్చింది' అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వర్షంతో ఎదురైన ఇబ్బందులను చక్కదిద్దాల్సిన సీఎం, తొలి వానకే హైదరాబాద్ నగరం అతలాకుతలమైందని ఇంత నిర్లజ్జగా అంగీకరించడానికి సిగ్గనిపించడం లేదా? అని బుధవారం ఎక్స్ వేదికగా ఘాటుగా ప్రశ్నించారు.

హైదరాబాద్, జూన్ 10(ఈవార్తలు): ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అని, మున్సిపల్ శాఖ మంత్రి అనే విషయం కూడా రేవంత్‌రెడ్డి మరచిపోయినట్టున్నాడని ఎద్దేవా చేశారు. పొద్దంతా కాయకష్టంచేసి ఇండ్లకు తిరిగివెళ్లే సమయంలో కురిసిన వర్షానికి వాహనదారులు, ముఖ్యంగా ఆడబిడ్డలు అనేక కష్టాలు పడ్డారంటూ ఆవేదన వ్యక్తంచేశారు. సత్వర చర్యలు చేపట్టి గట్టెక్కించాల్సిన ప్రభుత్వం బాధ్యత లేకుండా వ్యవహరించడం దుర్మార్గమని మండిపడ్డారు. వర్షానికి హైదరాబాద్‌వాసులు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయి నాలుగు గంటల పాటు నరకయాతన పడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి ఒక్కరంటే ఒక్కరూ స్పందించలేదని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. గతంలో ఏటా వానకాలం ముందు మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ముందస్తు చర్యలు తీసుకొనేవారని గుర్తుచేశారు. విపత్కర సమయంలో చేపట్టాల్సిన పనులు, తీసుకోవాల్సిన చర్యలపై -2 వ పేజీలో...



## బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,886 |
| వెండి (కిలో): | రూ.2,60,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,102 |

## విశ్వవాణి



టెక్ కంపెనీలు భారీ ఏఐ డేటా సెంటర్ల నిర్మాణం కోసం చేస్తున్న పోటీ ఇప్పుడు ఒక పెద్ద అడ్డంకిని ఎదుర్కొంది. 2026కి ప్లాన్ చేసిన ప్రాజెక్టులలో దాదాపు సగం ఆలస్యం అవుతున్నాయి. కొన్నైతే పూర్తిగా రద్దయ్యాయి. స్థానిక విద్యుత్ గ్రిడ్లు ఈ భారీ ఏఐ డిమాండ్‌ను తట్టుకోలేకపోతున్నాయి. అలాగే ట్రాన్స్‌ఫార్మర్లు, బ్యాటరీలు వంటి కీలక భాగాల కొరత నిర్మాణ పనులను ఆలస్యం చేస్తోంది. అదే సమయంలో స్థానిక ప్రజల వ్యతిరేకత కూడా పెరుగుతోంది. దీంతో ఏఐ డేటా సెంటర్ల నిర్మాణం అడ్డంకిగా మారుతోంది.



# ప్రజలే నా దేవుళ్లు

"దేశానికి కాంగ్రెస్ పీడ విరగడైంది"


- హస్తం పార్టీవి వేల కోట్లు కుంభకోణాలు
- తన వైఫల్యాలను హిందువులపై నెట్టింది
- అన్ని వ్యవస్థలను కుప్పకూల్చారు
- ఒక్కో తప్పును సరి చేస్తూ వస్తున్నాం
- అవినీతి రహితంగా ఎన్డీయే పాలన
- ఎన్డీయే కాంక్లేవ్‌లో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: గత 12 ఏళ్ల నుంచి దేశానికి పట్టిన కాంగ్రెస్ పీడ విరగడైందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో వైఫల్యాలను తాము సరిదిద్దుతున్నామని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ తన వైఫల్యాలను హిందువులపై నెట్టిందని ధ్వజమెత్తారు. రూ.వేల కోట్ల కుంభకోణాలకు కాంగ్రెస్ పాల్పడిందని ఆగ్రహించారు. కాంగ్రెస్ పాలనలో వృద్ధిరేటు దారుణంగా ఉందని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వ్యవస్థలు కుప్పకూలాయని మండిపడ్డారు. బుధవారం - 2 వ పేజీలో...

# ఇరాన్ అంతం నా పంతం

### ఇక భారీగా విరుచుకుపడతాం.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిక

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. 'ఈరోజు మళ్లీ వారిని గట్టిగా దెబ్బకొడతాం' అంటూ వ్యాఖ్యానించారు. గల్ఫ్ ప్రాంతంలో అమెరికా-ఇరాన్ మధ్య సైనిక ఉద్రిక్తతలు మళ్లీ ముదురుతున్న నేపథ్యంలో ట్రంప్ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా చర్చనీయాంశమయ్యాయి. బహ్రెయిన్, కువైట్, జోర్డాన్‌లలో ఉన్న అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ దాడులు చేసిన కొన్ని గంటలకే ట్రంప్ స్పందించారు.



వాషింగ్టన్: బుధవారం తెల్లవారుజామున ఇరాన్‌పై అమెరికా వైమానిక దాడులు నిర్వహించగా.. దానికి ప్రతిగా ఇరాన్ ప్రాంతీయ దేశాలపై క్షిపణి దాడులు చేపట్టింది. ఈ పరిణామాలు యుద్ధం ముగింపునకు జరుగుతున్న ప్రయత్నాలకు ఎదురుదెబ్బగా మారాయి. ఈ సందర్భంగా వైట్ హౌస్‌లో మీడియాతో మాట్లాడిన ట్రంప్.. "ఇరాన్‌ను మళ్లీ గట్టిగా దెబ్బకొడతాం. ఆ దేశం వెంటనే అమెరికాతో ఒప్పందం చేసుకోవాలి" అని హెచ్చరించారు. యుద్ధం ప్రారంభమైన సమయంలో ఇరాన్‌లోని వంతెనలు, విద్యుత్ కేంద్రాలపై దాడి చేస్తామని చేసిన హెచ్చరికలను తరువాయి 2 వ పేజీలో...



# కాంగ్రెస్ వచ్చాకే తెలంగాణ లొల్లి

- బీఆర్ఎస్ పాలనలో ఆ సమస్య రాలేదు
- తెలంగాణ ఎవరి అయ్య జాగీరు కాదు
- ఉత్తర, దక్షిణాది భావనలు దేశానికి ప్రమాదం
- జాతీయ మీడియాతో పవన్ కల్యాణ్

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పవన్ కల్యాణ్, నారా లోకేష్ మధ్య నాయకత్వ పోరు నడుస్తోందా.. నారా లోకేష్‌తో ఇబ్బందనే పవన్ కల్యాణ్ తెలంగాణకు వెళ్లాలనుకున్నారా.. పవన్ కల్యాణ్ హైదరాబాద్ పర్యటన ఎపిసోడ్ తర్వాత ఇలాంటి ప్రశ్నలు ఎన్నో రాజకీయంగా చర్చనీయాంశమయ్యాయి. ఈ ప్రశ్నలకు సమాధానమిచ్చారు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్. నేషనల్ మీడియా ఏఎన్ఐ పాడ్ కాస్టులో పవన్ కల్యాణ్ అనేక అంశాలను వెల్లడించారు. తరువాయి 2 వ పేజీలో...



# 20 మంది పాక్ సైనికులు మృతి

### పీఓకేలో కూలిన పాకిస్థాన్ ఆర్మీ చాపర్

ముజఫరాబాద్: పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో బుధవారం ఘోర ప్రమాదం సంభవించింది. ముజఫరాబాద్ సమీపంలో పాకిస్థాన్ సైనిక హెలికాప్టర్ ఎంఐ-17 సాంకేతిక లోపంతో కూలిపోయింది. ఈ ఘటనలో 21 మంది సైనికులు మృతిచెందినట్టు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే రెస్క్యూ బృందాలు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించినట్టు అధికారులు తెలిపారు. సాధారణ విధుల్లో భాగంగా ప్రయాణిస్తున్న హెలికాప్టర్‌లో అకస్మాత్తుగా సాంకేతిక సమస్య తలెత్తినట్లు సమాచారం. దీంతో తరువాయి 2 వ పేజీలో...



# నేడు ఇంటర్ సప్లి ఫలితాలు విడుదల

హైదరాబాద్, జూన్ 10 (ఈవార్తలు): రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర (ఫస్టియర్, సెకండియర్) సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను గురువారం ఉదయం 11:30 గంటలకు అధికారికంగా విడుదల చేయనున్నట్లు తెలంగాణ ఇంటర్మీడియట్ తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

11.6.2026

మేషం: ఆప్తుల నుండి అవసరానికి సహాయ సహకారాలు అందుతాయి. దీర్ఘకాలిక ఋణాల నుండి విముక్తి లభిస్తుంది. వృత్తి ఉద్యోగాలలో మీ ప్రతిభ వెలుగులోకి వస్తుంది. సంతాన విద్యా విషయాలపై దృష్టి సారిస్తారు. వ్యాపార పరంగా నూతన పెట్టుబడులు లభిస్తాయి. సంఘంలో కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి.

వృషభం: ముఖ్యమైన వ్యవహారాలలో ఆత్మ విశ్వాసంతో పని చేసి లాభాలు అందుకుంటారు. వ్యాపారాలలో కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. దాయాదులతో ఆస్థి వివాదాలు పరిష్కరించుకుంటారు. వృత్తి ఉ ద్యోగాలలో అధికారుల నుండి ఆశించిన సహకారం అందుతుంది. నిరుద్యోగులకు లభించిన అవకాశలు సద్వినియోగం చేసుకోవాలి.

మిధునం: ఋణ ఒత్తిడి అధికమై మానసిక శిరో భాధలు తప్పవు. దూర ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. దైవ సేవా కార్యక్రమాలలో విశేషంగా పాల్గొంటారు. సంతాన విషయమై ఊహించని విషయాలు తెలుస్తాయి. స్థిరాస్తి ఒప్పందాలు కష్టం మీద పూర్తవుతాయి. వృత్తి ఉద్యోగాలలో గందరగోళ పరిస్థితులుంటాయి.

కర్కాటకం: మిత్రులకు మీ అభిప్రాయాలు నచ్చే విధంగా ఉ ఒడవు. అనుకున్న సమయానికి అనుకున్న విధంగా పనులు పూర్తి చేయలేరు. కుటుంబ పెద్దలతో మాటపట్టింపులుంటాయి. ఇంటా బయట ఒత్తిడి వలన శారీరక మానసిక ఆరోగ్య సమస్యలు బాధిస్తాయి. ఉద్యోగాల్లో అధికారుల ఆగ్రహానికి గురికావాల్సివస్తుంది. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి.

సింహం: బంధుమిత్రుల సమాగమం ఆనందం కలిగిస్తుంది. వృత్తి ఉద్యోగాలలో అందరితో సఖ్యతగా వ్యవహరించి ఆకట్టుకుంటారు. సమాజంలో కీర్తిప్రతిష్టలు పెరుగుతాయి. ఆర్ధిక ప్రయత్నాలు అనుకూల ఫలితాలు ఇస్తాయి. వాహన అనుకూలత కలుగుతుంది. జీవిత భాగస్వామితో దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

కన్య: దీర్ఘకాలిక అనారోగ్య సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. బంధు మిత్రుల నుండి అరుదైన ఆహ్వానలు అందుతాయి. వ్యాపారాలు మరింత పుంజుకుంటాయి. నిరుద్యోగ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో మీ ప్రవర్తనకు అధికారుల నుండి ప్రశంసలు అందుకుంటారు.

తుల: చేపట్టిన పనులలో జాప్యం కలుగుతుంది. శారీరక మానసిక సమస్యలు భాదిస్తాయి. ఉద్యోగమున విలువైన పత్రముల విషయంలో జాగ్రత్త వ్యవహరించాలి. వ్యాపారాలలో స్వంత నిర్ణయాలు కలిసిరావు. కుటుంబ విషయంలో ఆలోచనలలో స్థిరత్వం ఉండదు. దైవ కార్యక్రమంలో పాల్గొనడం మంచిది.

వృశ్చికం: నూతన వాహన కొనుగోలు ప్రయత్నాలు మందకొడిగా సాగుతాయి. బంధు మిత్రులతో అకారణ వివాదాలు కలుగుతాయి. కుటుంబ పెద్దల ఆరోగ్య విషయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి. చేపట్టిన పనులలో జాప్యం కలుగుతుంది. అవసరానికి చేతిలో డబ్బు నిల్వ ఉ ఒడదు. వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి.


ధనస్సు: కీలక వ్యవహారాలలో ధైర్యంగా నిర్ణయాలను తీసుకుని లాభాలు అందుకుంటారు. నూతన వ్యాపార ప్రారంభానికి అవరోధాలు తొలగుతాయి. నూతన వస్త్ర ఆభరణాలు కొనుగోలు చేస్తారు. అన్ని వైపుల నుండి ఆదాయ మార్గాలు పెరుగుతాయి. సోదరుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి.

మకరం: అనవసర వస్తువులపై ధనవ్యయం చేస్తారు. సమయానికి నిద్రహారాలు ఉండవు. నేత్ర సంబంధిత అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ఆర్ధిక పరిస్థితి ప్రతికూలంగా ఉంటుంది. ఇతరుల నుండి విమర్శలు ఎదురవుతాయి. ఉద్యోగాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది. ఆప్తులతో మాట పట్టింపులు కలుగుతాయి.

కుంభం: సమాజంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. బంధు మిత్రుల నుండి విలువైన బహుమతులు పొందుతారు. నిరుద్యోగులకు నూతన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. విందు వినోద కార్యక్రమాల్లో ఉ త్సాహంగా పాల్గొంటారు. సంతానం విద్యా విషయాలు సంతృప్తికరంగా సాగుతాయి.

మీనం: ఇంటా బయటా జాగ్రత్తగా వ్యవహరించాలి. ప్రయాణాలలో మార్గ అవరోధాలు తప్పవు. ఆర్థిక వ్యవహారాలలో తొందరపాటు నిర్ణయాలు మంచివి కావు. ఊహించని రీతిలో ఖర్చులు పెరుగుతాయి. వృత్తి ఉద్యోగాలలో స్థానచలన సూచనలున్నవి. ఇంటా బయట వివాదాలకు దూరంగా ఉండటం మంచిది.

# ప్రజలే నా దేవుళ్లు



మొదటి పేజీ తరువాయి

ఢిల్లీలో జరిగిన ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సదస్సుకు ప్రధాని మోదీ హాజరై ప్రసంగించారు. కాంగ్రెస్ ఇనుప సంకెళ్ల నుంచి దేశాన్ని రక్షించామని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. అవినీతి రహితంగా ఎన్డీఏ పాలన సాగుతోందని స్పష్టం చేశారు. ప్రధానిగా సుదీర్ఘకాలం పనిచేసే అవకాశం దక్కడం తన అదృష్టమని తెలిపారు. ఇది తనకు అద్భుతమైన క్షణమని వ్యాఖ్యానించారు. తన జీవితంలో ఎన్నో ఎత్తుపల్లాలు చూశానని ప్రస్తావించారు. దేశ ప్రజలే తనకు దేవుళ్లు అని ఉద్ఘాటించారు. ఎన్డీఏలో ప్రతి పార్టీకి సమాన ప్రాధాన్యం ఇస్తున్నామని వివరించారు. తనను అభినందిస్తూ ఎన్డీఏ నేతలు తీర్మానం చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎన్డీఏ నేతలకు ధన్యవాదాలు తెలిపారు. అధికారాన్ని సేవగానే భావించానని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. తమ హయాంలో స్థిరమైన పాలనతో అభివృద్ధి వేగవంతం అయిందని వెల్లడించారు. 2014కి ముందు దేశంలో ఎంతో అస్థిరత ఉందని తెలిపారు. 2014 తర్వాత దేశ రూపురేఖల్లో అనేక మార్పులు తీసుకువచ్చామని ప్రస్తావించారు. ఎన్డీఏపై దేశ ప్రజల్లో నమ్మకం పెరిగిందని అన్నారు. 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తున్నామని ఉద్ఘాటించారు. అన్నివర్గాల ప్రజల ఆశలకు అనుగుణంగా నడుస్తున్నామని పేర్కొన్నారు. గతంలో దశాబ్దాలపాటు జరిగే అభివృద్ధి.. ఇప్పుడు కేవలం నెలల వ్యవధిలోనే జరుగుతోందని వివరించారు. తమ పథకాలు, కార్యక్రమాలను ప్రజలు ఆదరించారని ప్రధాని మోదీ తెలిపారు. వికసిత్ భారత్‌లో అందరూ భాగస్వాములయ్యారని వెల్లడించారు. దేశంలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశామని చెప్పారు. ఇంటర్నెట్ యూజర్ల సంఖ్యను 25 కోట్ల నుంచి 100 కోట్లకు పెంచామని అన్నారు. కరోనా లాంటి సంక్షోభాన్ని అధిగమించామని ఉద్ఘాటించారు. స్థిరమైన ప్రభుత్వం ఉంటేనే అభివృద్ధి సాధ్యమని వ్యాఖ్యానించారు. తాము లెక్కలు మాత్రమే చెప్పడం లేదని.. ఆచరణలో చేసి చూపించామని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తమ పాలసీలు ఉంటాయని వివరించారు. ప్రపంచ దేశాలు ఆర్థిక సంక్షోభంలో ఉన్నా.. భారత్‌లో 7.7శాతం వృద్ధి రేటు ఉందని పేర్కొన్నారు. సామాన్యులపై భారం తగ్గించేందుకు కృషి చేస్తున్నామని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ వృద్ధిరేటు కంటే ఎన్డీఏ హయాంలోని 12 ఏళ్లలో వృద్ధిరేటు తెలిపోయిందని అన్నారు. దేశంలో మావోయిస్టులను అంతం చేశామని తెలిపారు. నేషన్ ఫస్ట్ నినాదంతో పనిచేస్తున్నామని వివరించారు. దేశ భవిష్యత్తు కోసం కఠిన నిర్ణయాలకూ కూడా వెనుకాడమని చెప్పారు. మహిళలకు రిజర్వేషన్లు కల్పించామని తెలిపారు. ట్రిపుల్ తలాక్ చట్టం తీసుకువచ్చామని ప్రస్తావించారు. ఆర్టికల్ నంబర్- 370ని రద్దు చేశామని అన్నారు. కశ్మీర్‌లో ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపామని చెప్పుకొచ్చారు. తనకు పార్టీ కంటే.. దేశ ప్రజలే ముఖ్యమని స్పష్టం చేశారు. తమది లెక్కల ప్రభుత్వం కాదని.. ఆచరణాత్మక ప్రభుత్వమని ఉద్ఘాటించారు. దేశంలో డిజిటల్ పేమెంట్లను ప్రోత్సహించామని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. ప్రపంచమంతా ఇప్పుడు భారత్‌వైపు చూస్తోందని తెలిపారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా.. భారత్ మారడానికి మరింత వేగంగా పనిచేయాల్సిన అవసరం ఉందని వివరించారు. విదేశాలపై ఆధారపడటం తగ్గించుకోవాలని సూచించారు. మేడ్ ఇన్ ఇండియా నినాదం సాకారమవుతోందని అన్నారు. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో నౌకలు తయారు చేస్తున్నామని తెలిపారు. అణుఇంధన ఉత్పత్తిపై దృష్టి పెట్టాలని సూచించారు. డేటా సెంటర్ల హబ్‌గా భారత్ మారుతోందని వ్యాఖ్యానించారు. 500 గిగావాట్ల ఇంధన లక్ష్యాన్ని సాధించాలని చెప్పుకొచ్చారు. సెమీకండక్టర్లు, క్రిటికల్ మినరల్స్‌పై దృష్టిపెట్టామని తెలిపారు. ప్రపంచం కంటే ఒకడుగు మనమే ముందుండాలని పేర్కొన్నారు.

# ప్రజలకు టార్చర్!

మొదటి పేజీ తరువాయి

దృష్టిపెట్టేవారని చెప్పారు. కానీ మున్సిపల్ మంత్రిగా వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ సంప్రదాయాన్ని తుంగలో తొక్కారని విరుచుకుపడ్డారు. చెత్తతో కూరుకుపోయిన డ్రైనేజీలు, సిల్ట్ పేరుకుపోయిన మురుగు కాలువలను శుద్ధి చేసిన దాఖలాలు లేవని దుయ్యబట్టారు. కేవలం రాజకీయాలు తప్ప ప్రజాసమస్యలు, నగర పరిస్థితిపై కనీసం ఒక్క సమీక్ష కూడా చేయకపోవడం శోచనీయమని ధ్వజమెత్తారు. వర్షాకాల ప్రణాళిక సన్నద్ధతపై నిర్లక్ష్యం చేయడం వల్లే హైదరాబాద్ నగరంలో చిన్న వర్షానికే దారుణమైన పరిస్థితులు నెలకొంటున్నాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలనలో ఎస్ఎన్‌డీపీ, ఎస్ఆర్‌డీపీ లాంటి పకడ్బందీ ప్రణాళికలను అమలు చేసి నగరవాసుల కష్టాలు తీర్చామని ఆయన గుర్తుచేశారు. కానీ కాంగ్రెస్ గద్దెనెక్కిన తర్వాత మళ్లీ కథ మొదటికి తెచ్చిందని ఆరోపించారు. ఓ వైపు కరెంట్ కోతలతో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నా, మరోవైపు విద్యుదాఘాతంతో మరణాలు సంభవిస్తున్నా ఈ సర్కార్‌లో చలనం లేకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. రాజధానిలో విలువైన భూములను కబ్జా చేయడమే ఏకైక పనిగా పెట్టుకున్న రేవంత్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు హైదరాబాద్ ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. రాష్ట్రానికే ఎకనమిక్ ఇంజిన్ అయిన హైదరాబాద్‌ను గాలికొదిలేసిన సీఎంకు, కాంగ్రెస్ పార్టీకి వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో ఘోర పరాభవం తప్పదని తేల్చిచెప్పారు.



# 20 మంది పాక్ సైనికులు మృతి

మొదటి పేజీ తరువాయి

నియంత్రణ కోల్పోయి ముజఫరాబాద్ ప్రాంతంలో కూలిపోయింది. ఈ ఘటనపై విచారణకు పాకిస్థాన్ సైన్యం ఆదేశించినట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు తెలుసుకోడానికి ప్రత్యేక బృందం దర్యాప్తు చేపట్టనుంది. ప్రమాద సమయానికి హెలికాప్టర్‌లో ఎంతమంది ఉన్నారనేది స్పష్టత లేదు. జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జాక్)ను ఉగ్రవాద నిరోధక చట్టాల కింద స్థానిక ప్రభుత్వం నిషేధించిన నేపథ్యంలో ఆందోళనలకు పిలుపునివ్వడంతో ముజఫరాబాద్‌లో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. పీఓకేలో గతవారం రోజుల నుంచి ఉద్రిక్తత పరిస్థితులు నెలకున్నాయి. భద్రతా బలగాల కాల్పుల్లో 30 మందికిపైగా ప్రాణాలు కోల్పోయినట్టు అధికారికంగా ప్రకటించినా.. ఈ సంఖ్య ఎక్కువే ఉంటుందని నివేదికలు చెబుతున్నాయి. పీఓకే ప్రజా ఉద్యమాన్ని అణచివేయడానికి పాకిస్థాన్ 14,000 మంది అదనపు భద్రతా సిబ్బందిని రంగంలోకి దించినట్లు నివేదికలు వస్తున్నాయి. జాక్ కీలక నేతలే లక్ష్యంగా హత్యలు, అర్ధరాత్రి నిర్బంధాలు వంటి చర్యలకు తెగబడుతోంది. ఈ నేపథ్యంలో సైనిక హెలికాప్టర్ కూలిపోవడం సంచలనంగా మారింది. 30 మంది సైనికులను, 12 స్ట్రెచర్‌లను లేదా సుమారు 4,000 కిలోల బరువున్న సామాగ్రిని మోసుకెళ్లగలిగే సామర్థ్యం ఉన్న ఈ హెలికాప్టర్‌కు అమర్చిన బాహ్య స్లింగ్ మూడు టన్నుల వరకు బరువును ఎత్తడానికి వీలు కల్పిస్తుంది. ఇది రెండు క్లిమోవ్ టీవీ3-117 ఇంజిన్‌ల ద్వారా శక్తిని పొందుతుంది. గంటకు 250 కిలోమీటర్ల వేగాన్ని అందుకోగలదు.

# కాంగ్రెస్ వచ్చాకే తెలంగాణ లొల్లి

మొదటి పేజీ తరువాయి

ఈ క్రమంలోనే ఏపీలో నారా లోకేష్‌తో నాయకత్వ పోరు కారణంగానే తెలంగాణలో జనసేనను విస్తరించాలనుకుంటున్నారా అని యాంకర్ అడిగిన ప్రశ్నకు పవన్ కల్యాణ్ బదులిచ్చారు. తెలంగాణలో జనసేన పార్టీ విస్తరణకు.. ఏపీలో నారా లోకేష్‌తో నాయకత్వ పోరే కారణమనే ఊహాగానాలను పవన్ కల్యాణ్ కొట్టిపారేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎలాంటి నాయకత్వ సమస్య లేదని, తాను ఏ పదవిని ఆశించడం లేదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఇక తెలంగాణ ఎవరి అయ్య జాగీరు కాదంటూ తాను చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను సమర్థించుకున్నారు. తెలంగాణలోకి తన ప్రవేశాన్ని ఎవరూ అడ్డుకోలేరని స్పష్టం చేశారు. తన వ్యాఖ్యలపై వివాదం నెలకొన్నప్పటికీ.. పవన్ కల్యాణ్ తన వ్యాఖ్యలను సమర్థించుకున్నారు. తెలంగాణలోని కొందరు నాయకులు, కొన్ని శక్తులు నిరంతరం తనను ప్రశ్నిస్తూనే ఉన్నాయన్న పవన్ కల్యాణ్.. అక్కడ ఎన్నికల్లో పోటీ చేయడం మాట అటుంచి, కనీసం హైదరాబాద్‌లో కూడా అడుగుపెట్టలేనని అంటూ వచ్చారని తెలిపారు. తన మాతృ దేశంలో ఒక రాష్ట్రంలోకి ప్రవేశించవచ్చా లేదా అని తనకు చెప్పే హక్కు ఎవరికీ లేదని.. అందుకే ఇది మీ అయ్య జాగీర్ కాదని అన్నట్లు పవన్ కల్యాణ్ సమర్థించుకున్నారు. ఇక తాను బీజేపీ అజెండాను ముందుకు తీసుకెళ్తున్నానన్న విమర్శలపైనా పవన్ కల్యాణ్ స్పందించారు. తన అభిప్రాయాలు జాతీయవాదంతో రూపుదిద్దుకున్నాయని వెల్లడించారు. అలాగే దక్షిణాది, ఉత్తరాది భావన సరికాదని సూచించారు. ఇది పెరిగితే దేశానికి ప్రమాదకరమని పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. ఇదే పాడ్ కాస్ట్‌లో తనకు పవన్ కల్యాణ్ పేరు ఎలా వచ్చిందో కూడా చెప్పుకొచ్చారు. చిన్నప్పుడు తన పేరు కల్యాణ్ కుమార్ అని కాలక్రమంలో ఇది పవన్ కల్యాణ్‌గా స్థిరపడిందన్నారు.

# మాది ఫ్యూచర్!

మొదటి పేజీ తరువాయి

సిటీ ప్రాజెక్టును అడ్డుకునేందుకు బీఆర్ఎస్ నేతలు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలు తిరస్కరించిన ఆ పార్టీ, అభివృద్ధి పనులకు ఆటంకం కలిగిస్తే రాజకీయంగా మరింత కనుమరుగవుతుందని హెచ్చరించారు. ఇటీవల కురిసిన వర్షాలకు హైదరాబాద్‌లో రహదారులు జలమయం కావడాన్ని ప్రస్తావిస్తూ.. చెరువులు, నీటి వనరులు ఆక్రమణలే ఇందుకు ప్రధాన కారణమని ముఖ్యమంత్రి అన్నారు. గత ప్రభుత్వాల హయాంలో జరిగిన భూకబ్జాలను తొలగించి, చెరువులను పునరుద్ధరించడం ద్వారా 'లేక్ ఎకానమీ'ని అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించేందుకు ఈ ఏడాది డిసెంబర్‌లో మరో గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహిస్తామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్ నగరాన్ని నిరంతరం విస్తరించడం వల్లే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని ఆయన అన్నారు. ప్రస్తుతం రంగారెడ్డి జిల్లాలో భూముల ధరలు బంగారం ధరను మించిపోయాయని పేర్కొన్నారు. ఆనాటి నిజాం రాజులు, కులీకుతుబ్‌షాలు హైదరాబాద్ నగరాన్ని అనేక పర్యాయాలు విస్తరించారని గుర్తుచేశారు. ఫ్యూచర్ సిటీ నిర్మాణాన్ని అడ్డుకోవడానికి బీఆర్ఎస్ కుట్రలు చేస్తోందని, ఇలాగే వ్యవహరిస్తే వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రతిపక్ష హోదా కూడా దక్కదని ముఖ్యమంత్రి విమర్శించారు.

## ముగ్గురు భారతీయులు గల్లంతు

మొదటి పేజీ తరువాయి

20 నాటికల్ మైళ్ల దూరంలో ఉన్నప్పుడు దాడి జరిగినట్టు తెలియజేస్తూ ఆపద సంకేతాన్ని పంపింది. ఈ నౌకలో 24 మంది భారతీయులు సహా 28 మంది సిబ్బంది ఉన్నారు. దాడిపై నిరసన వ్యక్తం చేస్తూ న్యూఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయ సీనియర్ దౌత్యవేత్తకు కేంద్రం సమన్లు జారీ చేసింది. అటు.. గల్లంతైన ముగ్గురు సిబ్బంది కోసం ఒమన్ అధికారుల సమన్వయంతో గాలింపు చర్యలను ముమ్మరం చేసినట్లు వెల్లడించింది. సమస్యాత్మక జలాల్లో ప్రయాణించే భారతీయ పౌరులు, వాణిజ్య నౌకల భద్రతకే తమ ప్రాధాన్యం అని భారత్ స్పష్టం చేసింది.

## లండన్‌లో భారత సంతతి కుటుంబం దుర్మరణం

మొదటి పేజీ తరువాయి

టవర్‌లోని 36వ అంతస్తులో నివాసం ఉంటున్నారు. అయితే మే 27వ తేదీ ఉదయం సుమారు 7.30 గంటల సమయంలో వీరు ముగ్గురూ 36వ అంతస్తు నుంచి కింద పడ్డారు. ఒక్కసారిగా భారీ శబ్దం అవుతూ.. వారు కింద పడడాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే వారి వద్దకు పరుగులు పెట్టారు. అప్పటికే వారు ప్రాణాలు కోల్పోయారు. కాగా, బ్రిటీష్ మీడియా కథనాల ప్రకారం.. రాకేశ్ తన భార్య, కుమారుడిని చంపేసి ఆపై ఆత్మహత్య చేసుకున్నట్లు వివరిస్తున్నారు.

## కెనడాలో భారత సంతతి పోలీస్ హత్య

మొదటి పేజీ తరువాయి

నిందితుడు హఠాత్తుగా పోలీసుల కస్టడీ నుంచి తప్పించుకుని పారిపోవడానికి ప్రయత్నించాడు. అత్యంత ప్రమాదకరమైన ఆ నిందితుడు సమాజంలోకి వెళ్తే మరింత ముప్పు పొంచి ఉందనే ఉద్దేశంతో అక్కడే ఉన్న కానిస్టేబుల్ తరుణ్ బాలి సహా ఇతర సహచర సిబ్బంది అతడిని పట్టుకునేందుకు తీవ్రంగా వెంబడించారు. పోలీసుల బారి నుంచి ఎలాగైనా తప్పించుకోవాలనే క్రూరమైన ఆలోచనతో.. పారిపోయే క్రమంలో ఆ నిందితుడు ఒక వాహనాన్ని అదుపులోకి తీసుకున్నాడు. తనను అడ్డుకోవడానికి వస్తున్న కానిస్టేబుల్ తరుణ్ బాలిని లక్ష్యంగా చేసుకుని.. ఆ వాహనంతో అత్యంత వేగంగా, బలంగా ఢీకొట్టాడు. ఈ ఘోరమైన దెబ్బకు తరుణ్ బాలి శరీరానికి తీవ్రమైన గాయాలై అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. ఈ దారుణానికి ఒడిగట్టిన అనంతరం సదరు నిందితుడు మళ్లీ పారిపోవడానికి ప్రయత్నించగా.. ఇతర పోలీస్ దళాలు అతడిని చుట్టుముట్టి ఎట్టకేలకు తిరిగి అరెస్ట్ చేశాయి.

## ఇరాన్ అంతం నా పంతం

మొదటి పేజీ తరువాయి

అమలు చేస్తారా? అనే ప్రశ్నకు మాత్రం ఆయన స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు. "మేము ఒప్పందానికి చాలా దగ్గరగా వచ్చాం. కానీ ఇరాన్ కావాలనే ఆలస్యం చేస్తోంది" అని ట్రంప్ ఆరోపించారు. ఆసక్తికరంగా కేవలం రెండు రోజుల క్రితం యుద్ధం ముగిసే అవకాశం ఉందని.. చర్చలు తుది దశలో ఉన్నాయని వ్యాఖ్యానించారు. అటు.. వారాల తరబడి బాంబు దాడులు ఎదుర్కొన్నప్పటికీ ఇరాన్ వెనక్కి తగ్గడం లేదు. ప్రపంచ చమురు, సహజ వాయువు రవాణాకు కీలకమైన హోర్ముజ్ జలసంధిని మూసివేసే సామర్థ్యం తమకు బలమైన చర్చా ఆయుధమని టెహ్రాన్ భావిస్తోంది. ఇదే కారణంగా ఇరాన్ తన వైఖరిలో మార్పు చూపడం లేదు.


## నేడు ఇంటర్ సప్లి ఫలితాలు విడుదల

మొదటి పేజీ తరువాయి

బోర్డు వెల్లడించింది. సాధారణ కోర్సులతో (జనరల్) పాటు ఒకేషనల్ కోర్సుల విద్యార్థుల ఫలితాలను కూడా ఒకేసారి ఆన్‌లైన్ వేదికగా అందుబాటులోకి తీసుకురానున్నారు. రెగ్యులర్ పరీక్షల్లో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత సాధించలేకపోయిన విద్యార్థులు, అలాగే మార్కులు పెంచుకోవాలనే ఉద్దేశంతో ఇంప్రూవ్‌మెంట్ రాసిన విద్యార్థుల విద్యా సంవత్సరం వృథా కాకుండా ఈ ఫలితాలు అత్యంత కీలకం కానున్నాయి.

# మెట్రో ఫుట్‌పాత్‌లపై స్టాళ్లా?

## హైకోర్టు తీవ్ర ఆగ్రహం.. తొలగింపునకు ఏం చర్యలు తీసుకున్నారు?




**జీహెచ్ఎంసీని ప్రశ్నించిన న్యాయస్థానం**

హైదరాబాద్, జూన్ 10 (ఈవార్తలు): హైదరాబాద్ నగరంలో మెట్రో స్టేషన్ల కింద పాదచారుల కోసం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌సపై చిరు దుకాణాలను ఏర్పాటు చేయడాన్ని సవాలు చేస్తూ తెలంగాణ హైకోర్టులో ఒక పిటిషన్ దాఖలైంది. ఆ పిటిషన్‌పై బుధవారం విచారణ చేపట్టిన హైకోర్టు.. కీలక వ్యాఖ్యలు చేసింది. పాదచారులు నడిచేందుకు ఉద్దేశించిన ఫుట్‌పాత్‌లను లీజుకు ఇవ్వడం, అక్కడ దుకాణాలు ఏర్పాటు చేయడాన్ని కోర్టు తప్పుపట్టింది. ఫుట్‌పాత్ ఆక్రమించి స్టాళ్లను ఏర్పాటు చేయడంపై లాయర్ విజయ్ గోపాల్.. హైకోర్టుకు వివరాలను అందించారు. ఇలా మెట్రో స్టేషన్ల కింద స్టాళ్లు ఏర్పాటు చేసిన విషయానికి సంబంధించి.. ఇప్పటికే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)కి ఫిర్యాదు చేసినప్పటికీ.. అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని లాయర్ విజయ్ గోపాల్ హైకోర్టు దృష్టికి తీసుకువచ్చారు. అదే సమయంలో హైదరాబాద్ నగరంలో వీధి వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటున్న జీహెచ్ఎంసీ అధికారులు.. మెట్రోస్టేషన్ల కింద ఏర్పాటు చేసిన వాణిజ్య స్టాళ్ల విషయంలో మాత్రం చూసీచూడనట్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కోర్టుకు తెలిపారు. పిటిషనర్ వాదనలపై స్పందించిన హైకోర్టు.. మెట్రో స్టేషన్ ఫుట్‌పాత్ స్థలాన్ని లీజుకు లేదా అద్దెకు ఎలా ఇస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. పాదచారులు నడవడం కోసం ఉద్దేశించిన ప్రాంతాల్లో.. వాణిజ్యపరమైన కార్యకలాపాలకు అనుమతి ఇవ్వడం నగరవాసులు నడవడానికి తీవ్ర అంతరాయం కలుగుతుందని హైకోర్టు అభిప్రాయం వ్యక్తం చేసింది. ఈ అంశంపై సంబంధిత జీహెచ్ఎంసీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకున్నారో పేర్కొంటూ.. సంబంధిత వివరాలను సమర్పించాలని ప్రభుత్వం తరఫు లాయర్‌కు హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. అదే సమయంలో మెట్రో స్టేషన్ ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఏర్పాటు చేసిన స్టాళ్లపై వచ్చిన ఫిర్యాదులపై.. ఇప్పటివరకు అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టారో పూర్తి నివేదికను సమర్పించాలని జీహెచ్ఎంసీ, హైదరాబాద్ మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్ఆర్ఎంఎల్)లకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ పిటిషన్‌పై తదుపరి విచారణను ఈ నెల 17వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు తెలిపింది. మెట్రోస్టేషన్ల కింద స్టాళ్ల ఏర్పాటుపై హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఈ వ్యవహారం మరోసారి చర్చకు వచ్చింది.

మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811
నంబర్‌ను సంప్రదించవచ్చు.

## బొగ్గు, లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులపై రోడ్ షో

హైదరాబాద్, జూన్ 10 (పీఐబీ): న్యూఢిల్లీలో నిర్వహించిన బొగ్గు, లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టుల రోడ్ షో విజయవంతం కావటంతో హైదరాబాద్‌లోనూ గురువారం మరో రోడ్ షోను నిర్వహించేందుకు కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ సిద్ధమైంది. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బొగ్గు గనుల శాఖ సహాయమంత్రి సతీష్ చంద్ర దూబే అతిథులుగా హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్, అదనపు కార్యదర్శి సనోజ్ కుమార్ ఝా, మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులు, బొగ్గు, లిగ్నైట్ కంపెనీల ప్రతినిధులు, సాంకేతిక నిపుణులు, పారిశ్రామిక సంఘాలు, పెట్టుబడిదారులు, ఇతర కీలక భాగస్వాములు పాల్గొననున్నారు.

## మినీ స్టేడియం కోసం జూపల్లి సొంత భూమి విరాళం!

వీపనగండ్ల, జూన్ 10 (ఈవార్తలు): రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు యువత, క్రీడాకారుల భవిష్యత్తు కోసం కీలక నిర్ణయం తీసుకున్నారు. మినీ స్టేడియం నిర్మాణం కోసం తన సొంత భూమిని కేటాయిస్తూ బుధవారం అధికారికంగా డిజిటల్ సంతకాలు చేశారు. గతంలో వీపనగండ్ల మండల పర్యటనకు వెళ్లిన సమయంలో.. అక్కడ స్థానిక యువత, క్రీడాకారులు తమకు ఒక మినీ స్టేడియం కావాలని మంత్రి జూపల్లిని అభ్యర్థించారు. వారి కోరికపై సానుకూలంగా స్పందించిన మంత్రి, స్టేడియం నిర్మాణం కోసం తన సొంత భూమిని ఇస్తానని నాడు మాట ఇచ్చారు. ఇప్పుడు ఆ హామీని నెరవేరుస్తూ.. వీపనగండ్ల మండల కేంద్రంలోని సర్వే నెం. 532/ఆ లో తన పేరిట ఉన్న 4 ఎకరాల భూమిని క్రీడాకారుల అభివృద్ధి కోసం అందజేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేర్ మండల తహశీల్దార్ కార్యాలయంలో ఈ భూ బదిలీ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా పూర్తయింది. వీపనగండ్ల మండల తహశీల్దార్ లాగిన్ ద్వారా నిర్వహించిన ఈ ఆన్‌లైన్ ప్రక్రియలో మంత్రి జూపల్లి కృష్ణారావు స్వయంగా డిజిటల్ సంతకం చేసి భూమిని ప్రభుత్వానికి బదిలీ చేశారు. మంత్రి కేటాయించిన ఈ నాలుగు ఎకరాల భూమి ప్రస్తుత మార్కెట్ విలువ సుమారు రూ.1.50 కోట్లకు పైగానే ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఈ చారిత్రాత్మక భూ బదిలీ ప్రక్రియకు సాక్షులుగా కాంగ్రెస్ నాయకుడు మునిగొండ గోపి, జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ డిజిటల్ సంతకాలు చేశారు. మంత్రి తీసుకున్న ఈ ఉదార నిర్ణయంపై వీపనగండ్ల మండల ప్రజలు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత యువత, క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మినీ స్టేడియం అందుబాటులోకి వస్తే.. గ్రామీణ ప్రాంతాల్లోని అద్భుతమైన ప్రతిభ గల యువకులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదిగేందుకు ఒక గొప్ప వేదిక లభిస్తుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## 2047 వరకు మోదీయే ప్రధాని: బండి సంజయ్

కరీంనగర్, జూన్ 10 (ఈవార్తలు): భారత రాజకీయాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సరికొత్త చరిత్ర సృష్టించారని, దేశంలో అత్యధిక కాలం ప్రధానిగా కొనసాగిన తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును బద్దలు కొట్టారని కేంద్ర మంత్రి బండి సంజయ్ కొనియాడారు. కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. ప్రస్తుతం భారతదేశంలో అత్యధిక కాలం ప్రధానిగా సేవలందించిన అరుదైన రికార్డు మోదీ పేరిట లిఖించబడిందని హర్షం వ్యక్తం చేశారు. "రాబోయే 2047 సంవత్సరం వరకూ నరేంద్ర మోదీయే దేశ ప్రధానిగా కొనసాగాలి. ఆయన తీసుకుంటున్న విప్లవాత్మక నిర్ణయాల వల్ల ప్రపంచ దేశాల ముందు భారతదేశ కీర్తి ప్రతిష్ఠలు శరవేగంగా పెరుగుతున్నాయి. రాబోయే రోజుల్లో ప్రపంచంలోనే భారత్‌ను 'విశ్వగురు' స్థానంలో నిలబెట్టడం ఖాయం" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇదే సమయంలో, దేశవ్యాప్తంగా సంచలనం రేపుతున్న కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ వ్యవహారంపై మీడియా అడిగిన ప్రశ్నకు బండి సంజయ్ స్పందించారు. ఆ వివాదం పూర్తిగా కేంద్ర ఎన్నికల కమిషన్ పరిధిలోని అంశమని స్పష్టం చేశారు. ఇందులో రాజకీయ జోక్యం ఏమీ లేదని, చట్టప్రకారం ఈసీనే దానిపై తగిన నిర్ణయం తీసుకుంటుందని ఆయన వ్యాఖ్యానించారు.

## మోదీ పాలన స్వర్ణ యుగం: టీబీజేపీ చీఫ్

హైదరాబాద్, జూన్ 10 (ఈవార్తలు): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారత ప్రజాస్వామ్య చరిత్రలో అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. అత్యధిక కాలం నిరంతరాయంగా ప్రధాని పదవిలో కొనసాగిన నేతగా జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న రికార్డును ఆయన అధిగమించారు. నెహ్రూ 4,398 రోజుల పాటు ఈ పదవిలో ఉండగా, మోదీ 4,399 రోజులు పూర్తి చేసుకుని నూతన చరిత్రను లిఖించారు. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని తెలంగాణకు చెందిన బీజేపీ నాయకులు రామచంద్రరావు ప్రధాని మోదీకి శుభాకాంక్షలు తెలిపారు. ఇది ఒక చారిత్రక మైలురాయి అని ఆయన 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. 140 కోట్ల భారతీయుల ఆకాంక్షలకు, అచంచలమైన నమ్మకానికి మోదీ నిదర్శనమని, ఆయన పదవీకాలం దేశ చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయమని కొనియాడారు. నరేంద్ర మోదీ 2014 మే 26న తొలిసారిగా ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం 2019లో రెండోసారి, 2024 జూన్ 9న సంకీర్ణ ప్రభుత్వ సారథిగా మూడోసారి పగ్గాలు చేపట్టారు.



# గ్రీన్ సింబల్.. ఎఫ్‌సీడీఏ ఆఫీస్

## అత్యాధునిక టెక్నాలజీ, పర్యావరణ హిత పద్ధతులు

హైదరాబాద్, జూన్ 10 (ఈవార్తలు): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీలో భాగంగా ఇవాళ ఒక కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. ఫ్యూచర్ సిటీకి సింబల్‌గా ఉండే ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ భవనాన్ని (ఎఫ్‌సీడీఏ)ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇతర మంత్రులతో కలిసి రిబ్బన్ కట్ చేసి ఎఫ్‌సీడీఏ ఆఫీస్‌ను ప్రారంభించారు. రేపటి భవిష్యత్‌కు ఇప్పుడే పునాదులు వేసి.. ప్రపంచానికి అద్భుతమైన నగరాన్ని అందించనున్నట్లు తెలిపారు.

### ఎఫ్‌సీడీఏ భవనం ప్రత్యేకలు

ఈ ఎఫ్‌సీడీఏ బిల్డింగ్ నిర్మాణంలో అనేక జాగ్రత్తలు, అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించారు. పర్యావరణహితమైన సస్టైనబుల్ డిజైన్ పద్ధతులను అనుసరించారు. బిల్డింగ్ పైకప్పు మీద ఫోటో వోల్టాయిక్ షేడ్స్‌ను ఏర్పాటు చేశారు. ఇవి సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేయడమే కాకుండా.. భవనం లోపల సహజమైన చల్లదనాన్ని అందించనున్నాయి. గ్రీన్ రూఫ్ గార్డెన్స్, నీటి పునరుద్ధరణ కోసం ప్రత్యేకమైన ఎకో ఎస్టీపీ ప్లాంట్లను కూడా ఏర్పాటు చేస్తున్నారు. వర్షాల ద్వారా వచ్చిన నీటిని ఒడిసిపట్టి.. రీఛార్జ్ చేసే విధానం, వ్యర్థ జలాలను శుద్ధి చేసి.. వాటిని తిరిగి మొక్కలకు పోయడం వంటి చర్యలు పర్యావరణ పరిరక్షణకు అద్దం పడుతున్నాయి. ఇక ఆ బిల్డింగ్ చుట్టూ ఉండే ల్యాండ్ స్కేపింగ్‌లో దేశీయ మొక్కలకు ప్రాధాన్యం ఇచ్చేలా బయోడైవర్సిటీని కాపాడే చర్యలను చేపట్టారు. గాలి నాణ్యతను మెరుగుపరిచేందుకు బయోఫిలిక్ డిజైన్ ద్వారా లోపలి గదుల్లో కూడా పచ్చదనాన్ని నింపేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇక ఈ భవన నిర్మాణంలో వాడిన గాజు ఫ్యాకేడ్.. కేవలం అందం కోసం మాత్రమే కాకుండా.. వెలుతురుతోపాటు.. ఉష్ణోగ్రతను తగ్గించేలా ఉంటుంది. అక్కడ ఏర్పాటు చేయనున్న కలెక్షన్ పాండ్ ద్వారా నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచి.. చుట్టుపక్కల ప్రాంతాలకు కూడా అందించేలా ఏర్పాట్లు చేశారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతోపాటు.. ప్రకృతిని కలగలిపి నిర్మిస్తున్న ఈ ఎఫ్‌సీడీఏ భవనం ఫ్యూచర్ సిటీకి ఒక గ్రీన్ సింబల్‌గా నిలవనుందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. భవిష్యత్తులో తెలంగాణకు వచ్చే పారిశ్రామిక పెట్టుబడులు, కీలక ఒప్పందాలన్నీ ఈ ఎఫ్‌సీడీఐ నుంచే జరిగేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. కేవలం ఆఫీస్‌గా మాత్రమే కాకుండా.. ఒక నాలెడ్జ్ హబ్‌లా మారనుంది. ఐటీ, ఫార్మా, ఇతర రంగాల ప్రతినిధులతో చర్చలు జరిపేందుకు.. స్పెషల్‌గా కాన్ఫరెన్స్ హాల్స్ రెడీ చేశారు.

# కో లివింగ్.. కొట్లాటల అడ్డా!

**పెరుగుతున్న హత్యలు, ఆత్మహత్యలు**

**సర్కార్‌కు వీహెచ్ కీలక సూచన**


హైదరాబాద్, జూన్ 10 (ఈవార్తలు): హైదరాబాద్‌లో రోజురోజుకూ కో లివింగ్ కల్చర్ పెరిగిపోతోంది. ఈ క్రమంలోనే కో లివింగ్ హాస్టల్స్ పుట్టగొడుగుల్లో పుట్టుకొస్తున్నాయి. అయితే ఇలాంటి కో లివింగ్ హాస్టల్‌లలో ఉండే యువతీ యువకులు.. తమ కుటుంబాలకు ఆ విషయం చెప్పకుండా.. ప్రియుడు, ప్రియురాలితో కలిసి ఉంటున్న వారే ఎక్కువగా ఉన్నారు. ఈ క్రమంలోనే కో లివింగ్ హాస్టల్‌లలో ఉంటూ.. మనస్పర్థలు ఏర్పడి విడిపోతున్న జంటలు చూస్తూనే ఉన్నాం. మరికొందరు అయితే హత్య చేయడం లేదా ఆత్మహత్యకు చేసుకుని.. ప్రాణాలు తీసుకుంటున్నారు. ఈ కో లివింగ్ కల్చర్ పెరిగిపోవడం పట్ల నగరవాసులు తీవ్ర ఆందోళనలు వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ కో లివింగ్ హాస్టల్స్‌ను సమర్థించే వారు కొందరు, విమర్శించే వారు మరికొందరు ఉండటంతో వీటిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కో లివింగ్ హాస్టల్స్ నిర్వహణ తీరు, అందులో అసలు ఏం జరుగుతోంది.. ఈ కో లివింగ్ హాస్టల్స్ వల్ల యూత్ ఏ రకంగా ప్రభావితం అవుతోంది అనే విషయాలను తెలుసుకునేందుకు.. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వీ హనుమంత రావు కీలక సూచనలు చేశారు. ప్రస్తుతం నగరంలో నడుస్తున్న కో లివింగ్ హాస్టల్స్‌లో అసలు ఏం జరుగుతుందో క్షుణ్ణంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కో లివింగ్ హాస్టల్స్ పేరుతో అక్కడ జరుగుతున్న పరిస్థితులపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాల్సి ఉందని వీహెచ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేసి.. అది అధ్యయనం చేసిన తర్వాత.. వాటిని పూర్తిగా రద్దు చేయాలా లేక ఇంకా కఠినమైన రూల్స్ తీసుకురావాలా అనే విషయంపై ఒక క్లారిటీ వస్తుందని పేర్కొన్నారు. ఇలాంటి కో లివింగ్ హాస్టల్స్ పరిధిలో ఏవైనా అవాంఛనీయ ఘటనలు జరిగినప్పుడు మాత్రమే మీడియా సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోందని తెలిపారు. కో లివింగ్ హాస్టల్స్‌లో ఉండటం అనేది అమ్మాయిల తప్పా లేక అబ్బాయిల తప్పా అనేది తెలుసుకోవాలని వీహెచ్ హితవు పలికారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని కనుగొనాలంటే.. ఒక హై లెవల్ కమిటీ ద్వారా సమగ్రంగా విచారణ చేయించి.. ఆ కమిటీ ఇచ్చిన రిపోర్ట్ ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని పేర్కొన్నారు.



# పెద్దపల్లిలో తప్పిన పెను ప్రమాదం

**త్రుటిలో ప్రాణాలతో బయటపడ్డ రైల్వే కార్మికులు**

పెద్దపల్లి, జూన్ 10 (ఈవార్తలు): తెలంగాణలోని పెద్దపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో పెను ప్రమాదం త్రుటిలో తప్పింది. రైల్వే ట్రాక్ మరమ్మతు పనులు చేపడుతుండగా, ఓ ట్రాక్ మెయింటెనెన్స్ మెషిన్ అకస్మాత్తుగా పట్టాలు తప్పింది. అక్కడే ఉన్న సిబ్బంది అప్రమత్తమై పక్కకు పరుగులు తీయడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది. ఘటనకు సంబంధించిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి స్టేషన్ సమీపంలో రైల్వే సిబ్బంది పట్టాల తనిఖీ, మరమ్మతు పనుల్లో నిమగ్నమై ఉన్నారు. నలుగురైదుగురు సిబ్బంది ప్రయాణించేలా ఉండే ఈ ట్రాక్ తనిఖీ యంత్రం హఠాత్తుగా అదుపుతప్పి కార్మికుల వైపు దూసుకువచ్చింది. ప్రమాదాన్ని పసిగట్టిన సిబ్బంది తక్షణమే పక్కకు తప్పుకోవడంతో ముప్పు తప్పింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో అధికారులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. అయితే, ఈ ప్రమాదం కారణంగా రైల్వే ట్రాక్ గణనీయంగా దెబ్బతింది. సమాచారం అందుకున్న వెంటనే ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. యంత్రం పట్టాలు తప్పడానికి గల కారణాలను విశ్లేషించేందుకు ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించారు. ప్రస్తుతం దెబ్బతిన్న ట్రాక్‌కు యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు నిర్వహిస్తున్నామని, దీనివల్ల రైళ్ల రాకపోకలకు స్వల్ప అంతరాయం కలిగే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.



## మామిడి పండ్లు తిని అక్కాచెల్లెళ్ల మృతి

నారాయణగూడ/హైదరాబాద్, జూన్ 10 (ఈవార్తలు): హైదరాబాద్‌లో విషాదం చోటు చేసుకుంది. నారాయణగూడ ప్రాంతంలో మామిడి పండ్లు తిని అనారోగ్యం బారిన పడ్డారు. ఈ క్రమంలోనే వారిద్దరినీ దగ్గర్లోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా.. మొదట అక్క ప్రాణాలు విడిచింది. ఆ తర్వాత రోజే చెల్లి కూడా చనిపోయింది. దీంతో ఆ ఫ్యామిలీలో ఒకేసారి ఇద్దరి మరణం కోలుకోలేని దెబ్బతీశాయి. అయితే మామిడి పండ్లు తిన్న తర్వాత ఫుడ్ పాయిజన్ కావడంతోనే వారు అస్వస్థతకు గురై చనిపోయినట్లు భావిస్తున్నారు. కర్ణాటకలోని బీదర్‌కు వైజినాథ్, ఇందుమతి దంపతులకు మొత్తం నలుగురు కుమార్తెలు ఉన్నారు. వీరిలో ఇద్దరు కుమార్తెలు భువనేశ్వరి (17), సంధ్య (10) ప్రస్తుతం ప్రాణాలు కోల్పోయారు. వీరు ఉపాధి కోసం బీదర్ నుంచి హైదరాబాద్‌కు వచ్చారు. నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని విఠల్‌వాడి ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలోనే వీరికి బంధువైన రేణుక ఇటీవలె వారి ఇంటికి వచ్చింది. వస్తూ వస్తూ నారాయణగూడ జలమండలి సమీపంలో ఉన్న పండ్ల దుకాణంలో మామిడి పండ్లను కొనుగోలు చేసి.. ఇంటికి తీసుకువచ్చింది. ఆ పండ్లను తీసుకొచ్చి వైజినాథ్ కుటుంబ సభ్యులకు వచ్చింది. ఆ మామిడి పండ్లను ఇందుమతితో పాటు ఆమె నలుగురు కుమార్తెలు ఆదివారం సాయంత్రం తిన్నారు. పండ్లు తిన్న తర్వాత ఆ ఐదుగురు అస్వస్థతకు గురయ్యారు. వారికి వాంతులు, విరేచనాలు అయ్యాయి. దీంతో వెంటనే వారిని కాచిగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వైజినాథ్ మూడో కుమార్తె భువనేశ్వరి సోమవారం రోజున మృత్యువాత పడింది. ఆ తర్వాత మంగళవారం ఆమె చెల్లెలు సంధ్య కూడా ప్రాణాలు విడిచింది. ప్రస్తుతం వారి తల్లి ఇందుమతితో పాటు మరో ఇద్దరు కుమార్తెలు అదే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలోనే సంధ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించిన పోలీసులు.. వారి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. వారి మృతికి మామిడి పండ్లే కారణమా లేక మరేదైనా కారణం ఉందా అనేది తేల్చనున్నారు.


## మీనాక్షిపై కేసుల్లేవ్: రేవంత్

హైదరాబాద్, జూన్ 10 (ఈవార్తలు): మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు పోటీ చేస్తున్న కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను తిరస్కరించడంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఇది బీజేపీ పన్నిన కుట్ర అని, ఆ పార్టీ 'సీట్ల దొంగతనానికి' పాల్పడిందని ఆయన తీవ్ర స్థాయిలో విమర్శించారు. భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఇదొక చీకటి రోజని, ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా అభివర్ణించారు. మీనాక్షి నటరాజన్‌పై తెలంగాణలో ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఓట్ల దొంగతనం తర్వాత ఇప్పుడు బీజేపీ సీట్ల దొంగతనానికి దిగిందని ఆరోపించారు. తెలంగాణకు చెందిన ఓ మాజీ కార్పొరేటర్ కేసుకు సంబంధించిన వివరాలను అఫిడవిట్‌లో పొందుపరచలేదని బీజేపీ అభ్యంతరం వ్యక్తం చేయడంతో మధ్యప్రదేశ్‌లో రిటర్నింగ్ అధికారి ఆమె నామినేషన్‌ను తిరస్కరించారు. ఈ వ్యవహారంపై జైరాం రమేష్ నేతృత్వంలోని కాంగ్రెస్ బృందం ఎన్నికల సంఘాన్ని కలిసేందుకు ప్రయత్నించగా, వారిని అడ్డుకున్నారని సమాచారం.

# కోర్టు ధిక్కరణ.. 34 మంది ఐఏఎస్‌లు కోర్టుకు!

**కోర్టులోనే రోజంతా వేచి చూసిన పరిస్థితి**

**తమిళనాడు హైకోర్టులో సంచలనం**




చెన్నై: తమిళనాడులోని వివిధ జిల్లాలకు చెందిన కలెక్టర్లు, వివిధ శాఖలకు చెందిన ప్రిన్సిపల్ సెక్రెటరీలు సహా మొత్తం 34 మంది ఐఏఎస్‌లు ఒకే రోజు మద్రాసు హైకోర్టుకు హాజరయ్యారు. జూన్ 5న వీరంతా వివిధ కేసులకు సంబంధించి హైకోర్టులో న్యాయమూర్తుల ఎదుట హాజరైన విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. సివిల్ సర్వెంట్లు కోర్టు ధిక్కరణ ఆరోపణల కేసుల్లో హైకోర్టుకు వచ్చారు. ఇంత పెద్ద సంఖ్యలో ఐఏఎస్‌లు ఒకేరోజు కోర్టుకు న్యాయమూర్తుల ఎదుట నిలబడటం భారతదేశ చరిత్రలోనే తొలిసారి అని మద్రాస్ హైకోర్టు న్యాయ వర్గాలు పేర్కొన్నాయి. ఒకేసారి ఇంత మంది ఐఏఎస్‌లు హైకోర్టు హాజరుకావడం తీవ్రచర్చకు దారితీసింది. ఈ అధికారులు రోజంతా కోర్టులో వేచి ఉండి... తాము హాజరైనట్లు నమోదు చేయించుకున్నారు. హైకోర్టు వర్గాల ప్రకారం.. ఇటీవలే వేరే జిల్లాకు బదిలీ, ఇంకా బాధ్యతలు తీసుకోని ఓ మహిళా కలెక్టర్‌ను సైతం హాజరుకావాలని ఆదేశించడంతో ఆమె విమానంలో వచ్చి హాజరైనట్లు చెబుతున్నారు. అయితే, తదుపరి విచారణకు తనకు మినహాయింపు ఇవ్వాలని ఆమె కోర్టును అభ్యర్థించారు. అనంతరం ఆమె తాను బదిలీ అయిన జిల్లాకు వెళ్లి బాధ్యతలు తీసుకున్నారు. ఎలాంటి తప్పుచేయని అధికారులపై విధించిన మరో శిక్షణాత్మక చర్యగా చాలా మంది భావిస్తున్నారు. ముందుగా షోకాజ్ నోటీసులు జారీ చేసి, ఆదేశాలను ఉల్లంఘించినట్లు ప్రాథమికంగా ఆధారాలు ఉన్నాయా లేదా అని నిర్ధారించుకుని, ఆపై అధికారుల వివరణలను పరిశీలించిన తర్వాత మాత్రమే ఉద్దేశపూర్వకంగా కోర్టు ఆదేశాలను ధిక్కరించిన వారిపై విచారణ జరిపి ఉండవచ్చు కదా? అని అంటున్నారు.

# భార్య విలాసాలకు భర్త భరణం!

**భార్య నెలకు జీతం 1.40 లక్షలు.. అయినా భర్త 1.35 లక్షలివ్వాల్సిందే**

పూణే: సాధారణంగా ఆర్థిక స్థోమత లేని మహిళలకే కోర్టులు భరణాన్ని మంజూరు చేస్తాయనే భావన అందరిలోనూ ఉంటుంది. కానీ ఇందుకు పూర్తి భిన్నంగా వచ్చిన ఈ తీర్పు ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా పెద్ద ఎత్తున చర్చకు దారి తీసింది. పూణేకు చెందిన సదరు దంపతులిద్దరూ ఉన్నత విద్యావంతులే. వీరు ఐటీ, కార్పొరేట్ రంగాల్లో మంచి ఉద్యోగాలు చేస్తున్నారు. ప్రస్తుతం భర్త నెలకు రూ.2,79,499ల స్థిర ఆదాయాన్ని పొందుతుండగా.. భార్య కూడా నెలకు రూ.1,41,436ల భారీ జీతాన్ని ఆర్జిస్తోంది. అంతేకాకుండా భర్త తన సంపాదన నుంచి వృద్ధులైన తన తల్లిదండ్రుల బాధ్యతలను, వారి వైద్య ఖర్చులను కూడా చూసుకుంటున్నాడు. అయితే పెళ్లయిన కేవలం ఆరు నెలలకే వీరిద్దరి మధ్య తీవ్రస్థాయిలో మనస్పర్థలు తలెత్తాయి. కలిసి జీవించలేమని తేల్చుకున్న ఈ జంట చట్టబద్ధంగా విడిపోవాలని నిర్ణయించుకున్నారు. ఈక్రమంలోనే కోర్టుకు వెళ్లారు. ఈ కేసు విచారణ సందర్భంగా భార్య తరఫు న్యాయవాదులు కోర్టులో ఒక వింత వాదనను వినిపించారు. భర్త నుంచి విడిపోయిన తర్వాత ఒంటరిగా విలాసవంతమైన జీవనం సాగించడానికి భార్యకు తన స్వంత జీతం (రూ.1.41 లక్షలు) సరిపోదని పేర్కొన్నారు. వివాహమైన ఈ ఆరు నెలల కాలంలో భర్త ఇంట్లో తాను ఎలాంటి ఉన్నతమైన, విలాసవంతమైన జీవన శైలిని అనుభవించిందో.. విడాకులు తీసుకున్న తర్వాత కూడా అదే స్థాయి జీవితాన్ని కొనసాగించే చట్టబద్ధమైన హక్కు భార్యకు ఉంటుందని వాదించారు. ఈ వింత వాదనతో ఏకీభవించిన కుటుంబ న్యాయస్థానం.. భర్త సంపాదిస్తున్న నెలసరి జీతంలో దాదాపు సగం మొత్తాన్ని, అంటే రూ.1.35 లక్షలను భార్యకు తాత్కాలిక భరణంగా చెల్లించాలని సంచలన ఉత్తర్వులు జారీ చేసింది.

**మహారాష్ట్రలోని పూణే ఫ్యామిలీ కోర్టు ఒక అసాధారణమైన తీర్పును వెలువరించింది. సొంతంగా నెలకు లక్షన్నరకు పైగా జీతం తీసుకుంటున్న భార్యకు కూడా భర్త నెలనెలా రూ.1.35 లక్షల భరణం చెల్లించాల్సిందేనని న్యాయస్థానం స్పష్టం చేసింది.**



**మమత, సోనియా వరుస భేటీలు**

**రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం**

# కాంగ్రెస్‌లో టీఎంసీ విలీనం?

న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న తృణమూల్ కాంగ్రెస్ పార్టీ మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఇలాంటి తరుణంలో కాంగ్రెస్‌లో టీఎంసీని విలీనం చేసే దిశగా అడుగులు పడుతున్నాయనే ప్రచారం జోరుగా సాగుతోంది. టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ , ఆమె మేనల్లుడు అభిషేక్ బెనర్జీలు.. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్ గాంధీలతో వరుస భేటీలు రాజకీయ వర్గాల్లో ఎత్తున చర్చకు దారితీసింది. ప్రతిపక్ష ఇండియా కూటమిలో సమన్వయాన్ని బలోపేతం చేసే ప్రయత్నాల్లో భాగంగా టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ బుధవారం కాంగ్రెస్ అగ్రనేత నేత రాహుల్ గాంధీతో గంటన్నర పాటు సమావేశమయ్యారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. తాము బలమైన కూటమిని కోరుకుంటున్నామని, రాహుల్ గాంధీ నాయకత్వాన్ని అంగీకరిస్తున్నామని ఈ సమావేశంలో తృణమూల్ తెలియజేసింది. విలీనానికి సంబంధించిన ఏ ప్రతిపాదన అయినా తృణమూల్ నుంచే రావాలని, తాము అలాంటి చర్య కోసం ఒత్తిడి చేయడం లేదని కాంగ్రెస్ స్పష్టం చేసింది. దీనికి ముందు మంగళవారం మమతా బెనర్జీ, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీలు సమావేశమయ్యారు. ఇండియా కూటమి సమావేశంలో మమతా బెనర్జీ, సోనియా గాంధీల ఆలింగనానికి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ కాగా.. దీనిని తృణమూల్ పార్టీ వారి మధ్య ఉన్న దీర్ఘకాల అనుబంధానికి సంకేతంగా అభివర్ణించింది. సోమవారం జరిగిన ఇండియా కూటమి సమావేశం అనంతరం ఇరు పార్టీల మధ్య నిరంతరం సాగుతున్న చర్చల్లో భాగంగానే బుధవారం రాహుల్ గాంధీ, అభిషేక్ బెనర్జీల మధ్య ఈ భేటీ జరిగింది. బీజేపీని ఢీకొట్టేందుకు ప్రతిపక్షాల మధ్య మరింత సమన్వయం, ఐక్యత అవసరమని విపక్ష నాయకులు నొక్కి చెప్పారు. మరోవైపు, బెంగాల్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుభాంకర్ సర్కార్ విలీనానికి తలుపులు తెరిచే ఉంచామని పరోక్షంగా సంకేతాలు ఇచ్చారు. 'రాజకీయాలు అంటేనే సాధ్యాసాధ్యాల కళ... కాబట్టి రేపు ఏదైనా జరగవచ్చు' అని వ్యాఖ్యానించారు. "ఆర్ఎస్ఎస్ సిద్ధాంతానికి, బీజేపీ నియంతృత్వానికి వ్యతిరేకంగా మా నాయకుడు రాహుల్ గాంధీ అవిశ్రాంతంగా పోరాడుతున్నారు.. ఈ విషయంలో ఎక్కడా రాజీపడలేదు.. ఆయన ఎంతో అణచివేతకు గురయ్యారు. రాహుల్ గాంధీ సమాజంలోని వెనుకబడిన వర్గాలకు, కష్టాల్లో ఉన్న ప్రజలకు గొంతుకగా మారాలని మేము కోరుకుంటున్నాం...



ఆయనే ప్రధాని కావాలి.. ఈ విషయాన్ని అంగీకరించే ఎవరికైనా మా తలుపులు తెరిచే ఉంటాయి... అంత ధైర్యం లేని వారు కాంగ్రెస్‌లో చేరలేరు.. తప్పులు చేసినవారే తమ తప్పులు కడుక్కోవడానికి వాషింగ్ మెషిన్ కోసం వెతుక్కుంటారు" అని సర్కార్ అన్నారు. కాగా, టీఎంసీ, కాంగ్రెస్‌లకు ఉమ్మడి చరిత్ర ఉంది. మమతా బెనర్జీ కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చి 1998లో తృణమూల్ కాంగ్రెస్‌ను స్థాపించారు. 2011లో పశ్చిమ బెంగాల్‌లో లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వాన్ని ఓడించడానికి కాంగ్రెస్, టీఎంసీ కలిసి పనిచేశాయి, కానీ మరుసటి ఏడాదే వారి పొత్తు విచ్ఛిన్నమైంది. ఆ తర్వాత, 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు ఇండియా కూటమిలో భాగస్వాములయ్యారు. సోనియా గాంధీతో మమతా బెనర్జీ సమావేశమైన తర్వాత ఈ పార్టీల మధ్య సంబంధాలు మరింత బలపడతాయనే ఊహాగానాలు మొదలయ్యాయి. ఇటీవలి బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత తృణమూల్ కాంగ్రెస్ అంతర్గత తిరుగుబాటును ఎదుర్కొంటున్న తరుణంలో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. కొంతమంది ఎమ్మెల్యేలు, ఆ తర్వాత పలువురు ఎంపీలు పార్టీ నుంచి విడిపోయి బీజేపీ, ఎన్డీఏలతో పొత్తు పెట్టుకుంటామని సంకేతాలు ఇచ్చారు.

# మీనాక్షి నామినేషన్ తిరస్కరణపై సుప్రీంకు!

**కేసే లేదంటూ కోర్టుకెక్కిన కాంగ్రెస్**

న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు కాంగ్రెస్ నేత మీనాక్షి నటరాజన్ దాఖలు చేసిన నామినేషన్ తిరస్కరణ వివాదం సుప్రీంకోర్టుకు చేరింది. రిటర్నింగ్ అధికారి తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ అత్యవసర విచారణ కోరింది. తెలంగాణలో తనపై నమోదైన కేసు వివరాలను నామినేషన్ అఫిడవిట్‌లో వెల్లడించలేదన్న బీజేపీ అభ్యంతరం ఆధారంగా మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. అయితే ఆమెపై ఎలాంటి క్రిమినల్ కేసు నమోదు కాలేదని, కేవలం కోర్టు నోటీసు మాత్రమే జారీ అయిందని కాంగ్రెస్ వాదిస్తోంది. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ ఎంపీలు కే.సి. వేణుగోపాల్, జైరాం రమేష్, రణదీప్ సుర్జేవాలా సహా పలువురు నేతలు ఎన్నికల సంఘాన్ని కలిసి తమ వాదన వినిపించారు. మీనాక్షి నటరాజన్ కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను ఎన్నికల సంఘానికి అందించామని కాంగ్రెస్ నేతలు తెలిపారు. సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ మాట్లాడుతూ మీనాక్షి నటరాజన్‌పై క్రిమినల్ కేసు ఉన్నట్లు చెప్పడం సమంజసం కాదన్నారు. సంబంధిత కోర్టు ఇప్పటివరకు కేసును స్వీకరించలేదన్నారు. అది వెల్లడించాల్సిన కేసుల పరిధిలోకి రాదని వివరించారు. మరోవైపు పౌరహక్కుల కార్యకర్త తీస్తా సెతల్వాద్ కూడా రిటర్నింగ్ అధికారి నిర్ణయాన్ని తప్పుబట్టారు. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం కోర్టు అభియోగాలు నమోదు చేసిన తర్వాత మాత్రమే ఆ వివరాలను వెల్లడించాల్సిన అవసరం ఉంటుందని పేర్కొన్నారు. నామినేషన్‌ను తిరస్కరించడం చట్ట విరుద్ధమని అభిప్రాయపడ్డారు. ఈ వివాదం కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలను కూడా బయటపెట్టిందనే చర్చ జరుగుతోంది. తెలంగాణ నుంచి వచ్చిన సమాచారమే ఈ వివాదానికి కారణమైందని మధ్యప్రదేశ్ మంత్రి కైలాష్ విజయవర్గీయ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నాయకులే ఈ సమాచారాన్ని బయటకు ఇచ్చి ఉండొచ్చని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం ఈ అంశంపై సుప్రీంకోర్టు నిర్ణయం, ఎన్నికల సంఘం తుది నిర్ణయంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.



# బ్రిటన్ ప్రధానిపై నాలుగేళ్లుగా చైనా నిఘా

**పీఎం కారులో ట్రాకర్ ఆరోపణలు**

**ఖండించిన చైనా**

లండన్: బ్రిటన్‌లో చైనా గూఢచర్యం ఆరోపణలు మరోసారి చర్చనీయాంశమయ్యాయి. ప్రధాని అధికారిక కారులో చైనాకు సమాచారాన్ని పంపగలిగే ట్రాకింగ్ పరికరం గుర్తించారన్న సంచలన వాదన తాజాగా వెలుగులోకి వచ్చింది. ఈ విషయం పార్లమెంటరీ కమిటీ సమావేశంలో ప్రస్తావనకు రావడంతో రాజకీయ వర్గాల్లో కలకలం రేగింది. ఈ ఆరోపణలను బ్రిటన్‌కు చెందిన మాజీ దౌత్యవేత్త చార్ల్స్ పార్టన్ పార్లమెంట్ సభ్యుల ముందు వెల్లడించారు. 2022లో ప్రభుత్వ వాహనాల భద్రతా తనిఖీల సమయంలో ప్రధాని ఉపయోగించిన కారులో అనుమానాస్పద పరికరం బయటపడిందని చెప్పారు. ఆ పరికరం సెల్యులార్ మాడ్యూల్ ద్వారా చైనాకు డేటాను పంపుతున్నట్లు గుర్తించారని పేర్కొన్నారు. సెల్యులార్ మాడ్యూల్స్ అనేవి మొబైల్ నెట్‌వర్క్‌ల ద్వారా సమాచారాన్ని పంపే ఎలక్ట్రానిక్ పరికరాలు. ప్రస్తుతం కార్లు, విమానాలు, స్మార్ట్ పరికరాల్లో ఇవి విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. చైనాలో తయారైన ఓ సీల్డ్ కంపోనెంట్‌లో ఈ పరికరం దాచినట్లు సమాచారం. అయితే ఈ ఆరోపణల్లో పేర్కొన్న కారు ఏ ప్రధాని ఉపయోగించిందన్న విషయం స్పష్టంగా తెలియరాలేదు. ఆ సమయంలో బ్రిటన్‌లో బోరిస్ జాన్సన్, లిజ్ ట్రస్, రిషి సునాక్ ప్రధానులుగా పనిచేశారు. ఈ ఆరోపణలపై బ్రిటన్ ప్రభుత్వం అధికారికంగా స్పందించలేదు. భద్రతకు సంబంధించిన అంశాలపై వ్యాఖ్యానించబోమని మాత్రమే తెలిపింది. ప్రధాని భద్రతను పర్యవేక్షించే మెట్రోపాలిటన్ పోలీసులు కూడా ఇదే వైఖరి అవలంబించారు. మరోవైపు చైనా ఈ ఆరోపణలను ఖండించింది. ఇవన్నీ నిరాధారమైన వదంతులేనని పేర్కొంది. చైనా సంస్థలపై బురదజల్లే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించింది.

# బంగారం భారీగా పతనం

## అదే బాటలో వెండి కూడా

ముంబై: అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు పెరగడం, అమెరికా డాలర్ విలువ బలపడటంతో బుధవారం దేశీయ, అంతర్జాతీయ విపణిలో బంగారం, వెండి ధరలు భారీగా క్షీణించాయి. అమెరికా-ఇరాన్ మధ్య మరోసారి ఉద్రిక్తతలు నెలకొనడంతో చమురు ధరల ఒక్కసారిగా పుంజుకున్నాయి. ఇది ద్రవ్యోల్బణం భయాలను రేకెత్తించడంతో, సురక్షిత పెట్టుబడిగా పరిగణించే బంగారంపై ప్రతికూల ప్రభావం పడింది. ఢిల్లీ మార్కెట్‌లో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర పన్నులతో కలిపి రూ. 4,300 మేర తగ్గి రూ. 1.56 లక్షలకు చేరుకుంది. అదేవిధంగా, కిలో వెండి ధర సుమారు రూ. 10,000 పతనమై రూ. 2.45 లక్షలకు దిగివచ్చింది. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ధర ఔన్సుకు దాదాపు 90 డాలర్లు క్షీణించి 4,168 డాలర్ల వద్ద ట్రేడ్ అయింది. వెండి ధర కూడా 2.24 శాతం మేర తగ్గి ఔన్సుకు 63.87 డాలర్లుగా నమోదైంది. మధ్యప్రాచ్యంలో నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో, హార్ముజ్ జలసంధి ద్వారా చమురు సరఫరాకు ఆటంకం కలగవచ్చనే ఆందోళనలతో క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 90 డాలర్ల మార్కును దాటింది. ఇది ద్రవ్యోల్బణాన్ని మరింత పెంచుతుందని, తద్వారా వడ్డీ రేట్లు పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. దీంతో వడ్డీ ఆదాయం లేని పసిడి, వెండి వంటి ఆస్తులపై పెట్టుబడిదారుల ఆసక్తి సన్నగిల్లింది. అదే సమయంలో డాలర్ విలువ బలపడటం కూడా బులియన్ మార్కెట్‌పై ఒత్తిడిని మరింత పెంచింది.

## ఫ్లాట్‌గా స్టాక్ మార్కెట్లు

ముంబై: భారతీయ స్టాక్ మార్కెట్లు బుధవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి మిక్స్‌డ్‌గా స్థిరపడ్డాయి. సెన్సెక్స్ స్వల్ప లాభాలతో ముగియగా.. నిఫ్టీ నష్టాల్లోకి జారుకుంది. ట్రేడింగ్ ఆరంభంలో లాభాలు కనిపించినప్పటికీ ద్వితీయార్థంలో మెటల్, ప్రభుత్వ రంగ బ్యాంకులు, స్థిరాస్తి రంగాల షేర్లలో భారీగా లాభాల స్వీకరణ కనిపించింది. దీంతో మార్కెట్లు గరిష్ఠ స్థాయిల నుంచి వెనక్కి తగ్గాయి. చివరకు సెన్సెక్స్ 64.42 పాయింట్లు లాభపడి 73,983.18 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 27.15 పాయింట్లు నష్టపోయి 23,214.95 వద్ద ముగిసింది. నిఫ్టీ షేర్లలో హిందాల్కో ఇండస్ట్రీస్, కోల్ ఇండియా, ఓఎన్‌జీసీ షేర్లు అత్యధికంగా నష్టపోయాయి. రంగాల వారీగా చూస్తే నిఫ్టీ మీడియా, నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్, నిఫ్టీ రియల్టీ రంగాలు నష్టాలు మూటగట్టుకున్నాయి. దీనితో పాటు మిడ్-క్యాప్, స్మాల్-క్యాప్ షేర్లపై విక్రయాల ఒత్తిడి కనిపించింది. నిఫ్టీ మిడ్-క్యాప్ సూచీ 1.49 శాతం, నిఫ్టీ స్మాల్-క్యాప్ సూచీ 1.33 శాతం చొప్పున పతనమై ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. కొన్ని దిగ్గజ షేర్లు భారీ నష్టాల నుంచి మార్కెట్లను గట్టెక్కించాయి. సెన్సెక్స్‌లో హిందుస్థాన్ యూనిలీవర్, యాక్సిస్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు లాభాల బాట పట్టి సూచీని గ్రీన్ జోన్‌లో నిలబెట్టాయి. ముఖ్యంగా నిఫ్టీ ఎఫ్ఎమ్‌సీజీ సూచీ ఒక శాతానికి పైగా లాభపడగా ప్రైవేట్ బ్యాంకులు, కెమికల్ రంగాలు కూడా రాణించాయి.

## పోలీసుల నుంచి తప్పించుకొని మొసలికి చిక్కి!

**అమెరికాలోని లూసియానా రాష్ట్రంలో ఘటన**

న్యూయార్క్: పోలీసుల నుంచి తప్పించుకోవాలని చేసిన ప్రయత్నం ఓ వ్యక్తికి ఊహించని షాక్ ఇచ్చింది. అరెస్టు నుంచి తప్పించుకునేందుకు చెరువులోకి దూకిన అతడిపై ఓ మొసలి దాడి చేసింది. అమెరికాలో జరిగిన ఈ విచిత్ర ఘటన ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అమెరికాలోని లూసియానా రాష్ట్రంలో విక్టర్ రివాస్ అనే 40 ఏళ్ల వ్యక్తి మద్యం మత్తులో కారు నడుపుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. అతడు నడుపుతున్న టయోటా కారు రోడ్డుపక్కన ఉన్న కాంక్రీట్ డివైడర్‌ను ఢీకొట్టడంతో పాటు టైరు కూడా పేలిపోయింది. అనంతరం పోలీసులు ఆ వాహనాన్ని ఆపేందుకు ప్రయత్నించారు. అయితే రివాస్ కారును వదిలేసి కాలినడకన పారిపోయాడు. సమీపంలోని చెరువులోకి దూకి పోలీసులకు కనిపించకుండా తప్పించుకునే ప్రయత్నం చేశాడు. కొంతసేపటి తర్వాత పోలీసులు అతడిని గుర్తించినా మళ్లీ చిత్తడి ప్రాంతంలోకి పరిగెత్తాడు. అప్పుడే ఊహించని ఘటన జరిగింది. నీటిలో ఉన్న ఓ మొసలి వేగంగా అతడి వైపు దూసుకొచ్చి దాడి చేసింది. దీంతో రివాస్ రెండు చేతులకు గాయాలయ్యాయి. అయినప్పటికీ అతడు అక్కడి నుంచి మళ్లీ పారిపోయేందుకు యత్నించాడు. చివరకు డ్రోన్ సాయంతో అతడి కదలికలను గుర్తించిన పోలీసులు అరెస్టు చేశారు. గాయాల కారణంగా ముందుగా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం మద్యం మత్తులో వాహనం నడపడం, పోలీసుల నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నించడం తదితర కేసులు నమోదు చేశారు. ఈ ఘటన తర్వాత సోషల్ మీడియాలో సరదా వ్యాఖ్యలు వెల్లువెత్తాయి. స్థానిక పోలీసు స్టేషన్ కూడా మొసలిని 'డిప్యూటీ ఆఫ్ ది ఇయర్'గా చూపిస్తూ రూపొందించిన ఏఐ చిత్రాన్ని పంచుకుంది. "మద్యం తాగి డ్రైవింగ్ చేయొద్దు.. పోలీసుల నుంచి పారిపోవొద్దు.. ముఖ్యంగా లూసియానా చెరువుల్లో దాక్కోవద్దు" అంటూ సరదాగా వ్యాఖ్యానించింది.

# మాజీ ఐబీ చీఫ్ ఆధ్వర్యంలోనే పేలుళ్లు

**శ్రీలంక పేలుళ్ల కేసులో సంచలనం**

కొలంబో: శ్రీలంకను కుదిపేసిన 2019 ఈస్టర్ సండే పేలుళ్ల కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఆ దాడులకు దేశ మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ మేజర్ జనరల్ సురేశ్ సల్లేనే దిశానిర్దేశం చేశారని శ్రీలంక మంత్రి ఆనంద విజేపాల పార్లమెంట్‌లో వెల్లడించారు. 2019 ఏప్రిల్ 21న జరిగిన వరుస ఆత్మాహుతి దాడుల్లో 279 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. కొలంబోలోని మూడు లగ్జరీ హోటళ్లు, రెండు కాథలిక్ చర్చిలు, మరో ప్రార్థనా మందిరం లక్ష్యంగా ఉగ్రవాదులు దాడులు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా సురేశ్ సల్లే ఇస్లామిక్ తీవ్రవాదులతో కలిసి కుట్ర పన్నినట్లు తేలిందని మంత్రి వెల్లడించారు. దాడులకు మూడు వారాల ముందు ఆయన కొందరు ముస్లిం వ్యక్తులను కలుసుకొని చర్చిల వివరాలు, అక్కడికి వచ్చే వారి సమాచారం సేకరించారని చెప్పారు. అయితే ఈ ఆరోపణలను సల్లే ఖండించారు. తనకు ఈ ఘటనతో ఎలాంటి సంబంధం లేదని న్యాయవాది ద్వారా స్పష్టం చేశారు. ఈ కేసులో ఫిబ్రవరిలోనే సల్లేను అరెస్టు చేశారు. ప్రస్తుతం ఉగ్రవాద నిరోధక చట్టం కింద ఆయన్ను విచారిస్తున్నారు. నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ ఆయన నిరాహార దీక్ష చేపట్టగా ఆరోగ్యం క్షీణించడంతో ఆస్పత్రికి తరలించినట్లు మంత్రి తెలిపారు. సల్లే విచారణ తర్వాత మాజీ అధ్యక్షుడు గొటబాయ రాజపక్స దేశం విడిచి వెళ్లకుండా కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఆయన్ను కూడా త్వరలో విచారించే అవకాశం ఉందని సమాచారం. 2023లో బ్రిటన్‌కు చెందిన ఛానల్ 4 విడుదల చేసిన దర్యాప్తు కథనంలో కూడా సురేశ్ సల్లే పేరు ప్రస్తావనకు వచ్చింది. ఆ కథనం ప్రకారం అధ్యక్ష ఎన్నికల్లో రాజకీయ లాభం కోసం దాడులు జరగడానికి అవకాశం కల్పించారనే ఆరోపణలు వచ్చాయి. ఈస్టర్ పేలుళ్లకు రెండు రోజుల తర్వాత గొటబాయ రాజపక్స అధ్యక్ష అభ్యర్థిగా ప్రకటించుకుని, అదే ఏడాది జరిగిన ఎన్నికల్లో ఘన విజయం సాధించారు.

# మెస్సీ పాస్‌పోర్ట్ డేటా లీక్

మరో 24 గంటల్లో ప్రారంభం కానున్న ఫిఫా ప్రపంచ కప్ 2026ను వరుస వివాదాలు వెంటాడుతున్నాయి. తాజాగా, లియోనెల్ మెస్సీతో పాటు ఆయన అర్జెంటీనా సహచరుల పాస్‌పోర్ట్ డేటా లీక్ అయ్యింది. మంగళవారం ఐస్‌లాండ్‌తో జరిగిన ప్రపంచ కప్‌కు ముందు వార్మప్ మ్యాచ్ కోసం అర్జెంటీనా జట్టులోని లియోనెల్ మెస్సీతో సహా ప్రతి ఆటగాడి పాస్‌పోర్ట్ వివరాలు, ఒక భద్రతా లోపం కారణంగా లీక్ అయ్యాయని రాయిటర్స్ వార్తా సంస్థ ఒక నివేదికలో పేర్కొంది. అధికారిక జట్టు జాబితాలో ఉన్న పాస్‌పోర్ట్ నంబర్లు, మీడియా, ప్రజలకు విడుదల చేసే ముందు వాటిని బ్లర్ చేయాల్సి ఉంది. కానీ అలబామాలోని జోర్డాన్-హేర్ స్టేడియంలో వాటిని ఎటువంటి మార్పులు చేయకుండానే విడుదల చేశారు. కానీ, ఐస్‌లాండ్ ఆటగాళ్లు తమ పాస్‌పోర్ట్ వివరాలను సమర్పించకపోవడంతో అవి బయటకు రాలేదు. దీనిపై స్పందించాల్సింగా అర్జెంటీనా ఫుట్‌బాల్ ఫెడరేషన్, ఫిఫాను రాయిటర్స్ సంప్రదించింది. ఫిఫా ప్రపంచకప్‌ను చుట్టుముట్టిన వివాదాల్లో ఇది తాజాది.

# అక్రమాలు నిరూపిస్తే రాజీనామా

## ధాన్యం కొనుగోళ్లపై కొప్పులకు అడ్లూరి సవాల్.. స్థానిక అవసరాలకే ధర్మపురిలో ఇసుక తవ్వకాలు అని వెల్లడి



జగిత్యాల బ్యూరో, జూన్ 10 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలో యాసంగి సీజన్‌లో నిర్వహించిన ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి అక్రమాలు జరగలేదని, అవినీతి జరిగినట్లు నిరూపిస్తే మంత్రి పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సవాల్ విసిరారు. జగిత్యాల కలెక్టరేట్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌తో కలిసి ఆయన మాట్లాడారు. గత యాసంగి సీజన్‌లో జిల్లాలో 80 వేల మంది రైతుల నుంచి 4.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు మంత్రి తెలిపారు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో 5.12 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేయగా, ఇప్పటివరకు 5.08 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. ఇందుకోసం జిల్లాలో 436 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా, వాటిలో 417 కేంద్రాల్లో కొనుగోలు ప్రక్రియ పూర్తయిందని, మరో 19 కేంద్రాల్లో కొనసాగుతోందని వివరించారు. జిల్లాలో ఇప్పటివరకు రూ.1,215 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేయగా, 79,736 మంది రైతుల ఖాతాల్లో రూ.1,075 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అధికారులు రాత్రింబవళ్లు శ్రమించి కొనుగోలు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారని పేర్కొన్నారు. రైతులకు 24 గంటలూ అందుబాటులో ఉండి సహకరించిన అధికారులను అభినందించారు. కాగా,జిల్లాలో వడ్ల కొనుగోళ్లలో రూ.107 కోట్ల అవినీతి జరిగిందంటూ మాజీ మంత్రులు జీవన్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్ చేసిన ఆరోపణలను మంత్రి ఖండించారు. వారు చేసిన ఆరోపణలు నిరూపితమైతే తాను మంత్రి పదవికి రాజీనామా చేస్తానని స్పష్టం చేశారు. ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ప్రతిపక్షాలు నిరాధార ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. జీవన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన కొనుగోళ్లలో అవినీతి లేదని, ఇప్పుడు ఆయన బీఆర్‌ఎస్‌లో చేరిన తర్వాత మాత్రమే అవినీతి జరిగిందని ఎలా చెబుతారని ప్రశ్నించారు. ఇక, ధర్మపురి నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణా జరుగుతోందన్న ఆరోపణలను కూడా మంత్రి తోసిపుచ్చారు. స్థానిక అవసరాలు, ఇందిరమ్మ ఇళ్లు, ప్రభుత్వ నిర్మాణ పనుల కోసం మాత్రమే గోదావరి నుంచి ఇసుకను తరలిస్తున్నట్లు తెలిపారు. ఎక్కడా అక్రమ రవాణా జరగలేదని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ పాలనలో 'వరి వేస్తే ఉరి' అన్న నాయకులు, ప్రస్తుతం రైతులకు మద్దతు ధర చెల్లించి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుంటే తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం సహకరించకపోయినా రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు కొనసాగిస్తామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు.

# ధాన్యం, ఇసుక దోపిడీపై విచారణ జరపాలి

**బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్‌రెడ్డి**



జగిత్యాల బ్యూరో, జూన్ 10 (ఈవార్తలు): ధర్మపురి నియోజకవర్గంలో రైతులు మోసపోతున్నారని, ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్లు భారీ దోపిడీకి పాల్పడుతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్‌రెడ్డి ఆరోపించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధర్మపురి తహసీల్దార్ స్వాధీనం చేసుకున్న సుమారు 3 వేల ఇసుక డంపుల విలువ రూ.30 లక్షలు ఉంటుందని, ఆ ఇసుక ఏమైందో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులు నష్టపోతున్నారని జీవన్‌రెడ్డి తెలిపారు. తాను విక్రయించిన 544 బస్తాలకు ధర్మకాంటా ప్రకారం 218 క్వింటాళ్లు తూకం రాగా, ట్రక్‌షీట్‌లో 190 క్వింటాళ్లకే నమోదు చేశారని చెప్పారు. మరో రైతుకు 271 క్వింటాళ్లకు బదులు 250 క్వింటాళ్లు మాత్రమే ఇచ్చారని వివరించారు. ఈ వ్యత్యాసాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఐదు కిలోల వరకు కోతలు విధించడం వల్ల రైతులు నష్టపోతున్నారని ఆరోపించారు. జిల్లాలో 5 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణలో క్వింటాల్‌కు సగటున 10 కిలోల నష్టం జరిగితే రూ.125 కోట్ల దోపిడీ జరిగినట్లవుతుందని, రాష్ట్రవ్యాప్తంగా ఇది సుమారు రూ.2 వేల కోట్లకు చేరుతుందని పేర్కొన్నారు. ఆధారాలు చూపిస్తే రాజీనామా చేస్తానని మంత్రి చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ, రాజీనామా అవసరం లేదని, రైతుల పక్షాన నిష్పక్షపాతంగా పనిచేయాలని సూచించారు. కేసీఆర్ ప్రభుత్వం రైతు బంధు కింద ఎకరాకు రూ.10 వేలు అందించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం రూ.15 వేలు హామీ ఇచ్చి మూడు పంటలకు రైతు భరోసా ఇవ్వలేదని విమర్శించారు. రెండు లక్షల రుణమాఫీని పూర్తిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు బీమా పథకాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. హిట్లర్‌ను ప్రజాస్వామ్యంలో ఆదర్శంగా తీసుకోవడం సరైంది కాదని జీవన్‌రెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని సూచించారు. సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## కొత్త ఇండ్ల నిర్మాణానికి స్థలాలు గుర్తించాలి

**కలెక్టర్‌కు హనుమండ్ల జయశ్రీ వినతి**

జగిత్యాల టౌన్, జూన్ 10 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని ఇల్లు లేని నిరుపేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని మాజీ కౌన్సిలర్ హనుమండ్ల జయశ్రీ కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఆమె వినతిపత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేటాయించిన 4,520 ఇండ్లలో దాదాపు 4,350 ఇండ్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారని తెలిపారు. మిగిలిన 170 ఇండ్లను తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేటాయిస్తారని పలువురు ఆశించినప్పటికీ, అర్హుల సంఖ్య అధికంగా ఉండటంతో పంపిణీ నిలిచిపోయిందని పేర్కొన్నారు. గత పదేళ్లుగా కొత్త రేషన్ కార్డుల మంజూరు లేకపోవడంతో అనేక మంది అర్హులు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమయ్యారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు జారీ చేయడంతో కొత్త కుటుంబాలుగా ఏర్పడినవారు, ఇప్పటివరకు కార్డులు లేనివారు కూడా అర్హుల జాబితాలో చేరారని వివరించారు. దీంతో ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రజావాణి, హౌసింగ్ శాఖలకు దరఖాస్తులు పెరిగాయని చెప్పారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి ప్రతి నియోజకవర్గానికి 1,500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో, జగిత్యాల పట్టణం లేదా శివారు ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను గుర్తించాలని జయశ్రీ కోరారు. గతంలో నూకపల్లిలో ప్రభుత్వ స్థలాన్ని సేకరించి ఇండ్ల నిర్మాణం చేపట్టిన తరహాలోనే మరోసారి స్థలాలు గుర్తించి పేదలకు గృహాలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా ఇల్లు లేని ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతింటి కల నెరవేరేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

## వడ్ల కొనుగోళ్లలో భారీ అవినీతి

**అడ్లూరి రాజీనామా చేయ్.. మంత్రిపై కొప్పుల ఈశ్వర్ ఆరోపణలు**



జగిత్యాల బ్యూరో, జూన్ 10 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియలో భారీ అవినీతి జరిగిందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రెస్‌మీట్ సందర్భంగా ఆయన తీవ్రంగా స్పందించారు. ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలు జరిగాయని, ఏ గ్రేడ్ వడ్లను బీ గ్రేడ్‌గా మార్చి తక్కువ ధరకు కొనుగోలు చేశారని, హమాలీ ఛార్జీలు, తరుగు పేరుతో రైతులపై అదనపు భారం మోపారని ఆయన విమర్శించారు. 40 కిలోల బస్తాపై 3.3 నుంచి 3.4 కిలోల వరకు కోత విధించారని, ఒక్క లారీకే నాలుగు క్వింటాళ్ల వరకు తరుగు కట్ చేసిన ఘటనలు ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లాలో సుమారు రూ.107 కోట్ల వరకు రైతులకు నష్టం జరిగిందని ఆయన ఆరోపిస్తూ, రైతులు నెలల తరబడి కల్లాల వద్ద ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లను "సక్సెస్"గా చెప్పుకోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. రైతు బీమా, రైతు భరోసా, యూరియా సరఫరా అంశాల్లో ప్రభుత్వం విఫలమైందని విమర్శించిన ఆయన, గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇలాంటి సమస్యలు లేవని అన్నారు. చివరగా మంత్రి లక్ష్మణ్ కుమార్‌కు "రాజీనామా చేస్తావా లేదా నిర్ణయించుకో" అంటూ సవాల్ విసిరారు.

## మీనాక్షి నామినేషన్ తిరస్కరణ ప్రజాస్వామ్యంపై దాడి: అడువాల జ్యోతి

జగిత్యాల టౌన్, జూన్ 10 (ఈవార్తలు): మాజీ మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను తిరస్కరించడం ప్రజాస్వామ్యంపై జరుగుతున్న దాడిగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా టీపీసీసీ అధికార ప్రతినిధి ధరావత్ వెంకన్న నాయక్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో మీనాక్షి నటరాజన్ పై ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని తెలిపారు. అయినప్పటికీ రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘిస్తూ కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులను వేధించడం భారతీయ జనతా పార్టీకి అలవాటుగా మారిందని ఆయన విమర్శించారు.ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్న బీజేపీకి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు. రాబోయే రోజుల్లో బీజేపీ తన చర్యలకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని పేర్కొన్నారు.



## మోదీ పుష్కర పాలన.. మల్యాలలో బీజేపీ పూజలు

మల్యాల, జూన్ 10 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాలలోని శ్రీ మటమాంజనేయ స్వామి దేవస్థానంలో బీజేపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేశాన్ని అన్ని రంగాల్లో నంబర్ వన్‌గా నిలబెడుతున్న మోదీ ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు. పూజా కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గాజుల మల్లేశం, మాజీ ఎంపీటీసీలు కొల్లూరు గంగాధర్, రాచర్ల రమేశ్, ప్రధాన కార్యదర్శి పిల్లి రాజశేఖర్, బొబ్బిలి వెంకటస్వామి యాదవ్, జనగం రాములు, జవ్వాజి రాజ్ కుమార్, రుత్త కిషన్, జిల్లాల రమేశ్, శేర్ల పరుశురాం, నీలం రవి, పొన్నగంటి రవి, సంఘ శంకర్, గడ్డం చిన్న మల్లేశం బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొండగట్టు అంజన్న సేవలో జూనియర్ ఎన్టీఆర్ తల్లి, అత్త




మల్యాల, జూన్ 10 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ తల్లి షాలిని నందమూరి, అత్తమ్మ నార్నే మల్లీశ్వరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నార్నే మల్లీశ్వరి హనుమాన్ దీక్ష చేపట్టిన సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న వారికి దేవస్థాన అధికారులు, అర్చకులు ఆలయ సంప్రదాయం ప్రకారం ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి, దేశ ప్రజల సుఖశాంతులు, కుటుంబ సభ్యుల ఆయురారోగ్యాలు, శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వచనాలు అందించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు రామకృష్ణ, ఉప ప్రధాన అర్చకుడు చిరంజీవి, టెంపుల్ ఇన్స్పెక్టర్ చెక్కిళ్ళ అశోక్, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్ పాల్గొన్నారు.

## వల్లంపట్ల గిరీశ్‌కు సత్కారం




జగిత్యాల/రాజమండ్రి, జూన్ 10 (ఈవార్తలు): తెలుగు భాష సాహిత్యం, సంస్కృతి పరిరక్షణకు విశేష కృషి చేస్తున్న జగిత్యాలకు చెందిన డాక్టర్ వల్లంపట్ల గిరీశ్‌కుమార్‌ను ఏడవ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల్లో ప్రశంసాపత్రం, శాలువా, మెమెంటుతో ఘనంగా సత్కరించారు. ఏపీలోని రాజమహేంద్రవరం-గోదావరి గ్లోబల్ యూనివర్సిటీలో చైతన్య సాహిత్య పరిషత్, శ్రీ శ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మహాసభల్లో గిరీశ్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. శ్రీ శ్రీ కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్, జాతీయ అధ్యక్షుడు ఈశ్వరి భూషణ్, జాతీయ ప్రణాళిక కార్యదర్శి పార్థసారథిల చేతుల మీదుగా ఆయన ప్రశంశాపత్రాన్ని అందుకున్నారు. ఈ గుర్తింపు తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో తెలుగు భాషాభివృద్ధి కోసం మరింత కృషి చేస్తానని గిరీశ్ కుమార్ తెలిపారు.



## విద్యార్థులు లక్ష్యసాధన దిశగా కృషి చేయాలి

నల్లగొండ,జూన్ 10 (ఈవార్తలు): విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పరచుకొని లక్ష్యసాధన దిశగా కృషి చేయాలని నల్లగొండ జిల్లా అడిషనల్ ఎస్పీ రమేష్ గారు సూచించారు మంగళవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని లయన్స్ భవన్ లో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభకు పురస్కారం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు ప్రతి ఒక్కరూ ఉన్నత శిఖరాలను చేరుకోవాలంటే సరైన లక్ష్యాన్ని ఏర్పరచుకొని ఆ లక్ష్యాన్ని సాధించేందుకు అనుక్షణం తపిస్తూ చదవాలని సూచించారు. అనంతరం జిల్లాలోని 33 మండలాల్లో మండల టాపర్ గా నిలిచిన విద్యార్థులకు మోమెంటో, శాలువా సన్మానం, సర్టిఫికెట్ అదేవిధంగా 1000 క్యాష్ బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ నేషనల్ ట్రెజరర్ నూనె సుదర్శన్ గారు మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రతతో చదివి తల్లిదండ్రులకు, మీ పాఠశాలకు పేరు ప్రఖ్యాతలు తేవాలని అదేవిధంగా ఉన్నత శిఖరాలకు చేరుకునేందుకు అనుక్షణం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ రీజియన్ ప్రెసిడెంట్ కోట సరిత, నేషనల్ డైరెక్టర్ కోట్ల సాయికిరణ్, రీజియన్ సెక్రటరీ గూడూరు అంజిరెడ్డి, జాయింట్ సెక్రెటరీ నారాయణ కవిత, రవీంద్ర చారి, మాధవి, బాలు, నాగేశ్వరావు, లక్ష్మణ్, సరస్వతి, భీష్మాచార్య, విజయ్, భాస్కరరావు, గోపాల్ రావు, వెంకటేశ్వరరావు, సమీర్ బాబా, సురేష్, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.



## వలస కార్మికుల మృతదేహాల కోసం దుబాయ్‌కు ఎమ్మెల్యే సత్యం

**ప్రమాద బాధితుల కోసం**

**కుటుంబాలకు అండగా చొప్పదండి ఎమ్మెల్యే**

చొప్పదండి, జూన్ 10 (ఈవార్తలు): దుబాయ్‌లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జగిత్యాల జిల్లా వలస కార్మికుల కుటుంబాలకు అండగా నిలుస్తూ చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం స్వయంగా దుబాయ్‌కు బయలుదేరారు. ప్రమాదంలో మరణించిన వారి మృతదేహాలను స్వదేశానికి తీసుకురావడంలో ఏర్పడిన సమస్యలను పరిష్కరించి, త్వరితగతిన స్వగ్రామాలకు చేర్చేందుకు ఆయన ప్రత్యేకంగా చర్యలు చేపట్టారు. దుబాయ్‌లోని ఎమిరేట్స్ రోడ్డుపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వచ్చిన మినీ బస్సు ఢీకొనడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మొత్తం ఐదుగురు మృతి చెందగా, వారిలో జగిత్యాల జిల్లాకు చెందిన ముగ్గురు వలస కార్మికులు ఉన్నారు. ప్రమాద వార్త తెలిసిన వెంటనే ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. అనంతరం మృతదేహాలను స్వదేశానికి తరలించేందుకు అవసరమైన అనుమతులు, ఇతర ప్రక్రియలను వేగవంతం చేయడానికి స్వయంగా దుబాయ్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యం మాట్లాడుతూ, విదేశాల్లో ఉపాధి కోసం వెళ్లిన కార్మికులు ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని, బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.



## మోదీ నవభారత నిర్మాత: ఏసీఎస్ రాజు

జగిత్యాల, జూన్ 10 (ఈవార్తలు): భారత ప్రధాని నరేంద్ర మోదీ పాలన పగ్గాలు చేపట్టి బుధవారంతో 4,399 రోజులు పూర్తి చేసుకోవడం పాలనాపరంగా గొప్ప విజయమని భారత్ సురక్ష సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ ఏసీఎస్ రాజు పేర్కొన్నారు. దేశాన్ని అత్యధిక కాలం పాలించిన ప్రధానిగా జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును మోదీ అధిగమించడం చారిత్రక ఘట్టమని ఆయన అన్నారు. మోదీ తన 12 ఏళ్ల పాలనలో 81 కోట్ల మందికి ఉచిత రేషన్ అందించారని, పీఎం ఆవాస్ యోజన ద్వారా నాలుగు కోట్లకు పైగా ఇళ్లు నిర్మించారని తెలిపారు. మహిళలు, యువతకు పెద్దపీట వేస్తూ అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారని పేర్కొన్నారు. ఈ పాలనలో భారత్ విశ్వగురువుగా ఎదుగుతోందని అభిప్రాయపడ్డారు. సందర్భంగా మోడీకి శుభాకాంక్షలు తెలుపుతూ స్థానిక మార్కండేయ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మోదీ ఆయురారోగ్యాలతో దేశాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షించారు. ఆయనను "నవభారత నిర్మాత"గా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో 22వ వార్డు కౌన్సిలర్ అరవ లక్ష్మి, నాయకులు సింగం గంగాధర్, చిట్ల గంగాధర్, వేముల పోచ, మల్లు సిరిపురం గంగారం, ఆర్ఎస్ఎస్ వీరన్న, బొందుకూరి శ్రీనివాస్, పుప్పాల సత్యనారాయణ, ఎడమల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సమిండ్ల వాణికి ఎంసీ శుభాకాంక్షలు

జగిత్యాల టౌన్, జూన్ 10 (ఈవార్తలు): జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్‌ను మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నవీన్‌తో పాటు ఇతరులు పాల్గొన్నారు.

## గంగమ్మ బోనాల జాతరలో భోగ శ్రావణి

జగిత్యాల టౌన్, జూన్ 10 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని వాణినగర్ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ గంగమ్మ జాతర బోనాలు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జగిత్యాల నియోజకవర్గ ఇంచార్జ్ భోగ శ్రావణి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై గంగమ్మ తల్లికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆముదరాజు, గదాసు రాజేందర్, పవన్ సింగ్, ఇట్యాల రాము, రవి తేజ, చిట్యాల రమేష్, నారపాక అశోక్, కశెట్టి తిరుపతి, బద్దెల గంగరాజు, భోగ నరేష్‌తో పాటు గంగపుత్ర సంఘ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.




## కోరుట్ల దవాఖాన అవృద్ధికి చర్యలు

**ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్**

కోరుట్ల, జూన్ 10 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ పాల్గొన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన మౌలిక వసతులను మరింత మెరుగుపరచాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం ఉన్న బోర్‌వెల్‌కు మోటార్ ఫిట్టింగ్ చేయడంతో పాటు అదనంగా కొత్త బోర్‌వెల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కొత్త బోర్‌వెల్ ద్వారా రోజుకు సుమారు 40 నుంచి 50 వేల లీటర్ల నీటి సదుపాయం పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ఆసుపత్రిలో నీటి కొరత లేకుండా నిరంతర సరఫరా జరిగేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. రోలకు పరిశుభ్రమైన తాగునీరు, మెరుగైన పారిశుద్ధ్య వసతులు, అవసరమైన వైద్య సదుపాయాలు కల్పించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని సూచించారు. ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మరిన్ని నిధులు తీసుకురావడానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ తిరుమల వసంత-గంగాధర్, వైద్య అధికారులు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## ప్రజల భాగస్వామ్యంతోనే పరిశుభ్రత సాధ్యం

**జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్**

జగిత్యాల టౌన్, జూన్ 10 (ఈవార్తలు): జగిత్యాల పట్టణ పరిశుభ్రత, అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పలువార్డుల్లో నిర్వహించిన వార్డు సభల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని, తడి--పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ కార్మికులకు అందించడం ప్రతి పౌరుడి బాధ్యత అని సూచించారు. కాలానికి అనుగుణంగా మారాల్సిన అవసరం ఉందని, వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు, అంటువ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా తల్లిదండ్రులు పర్యవేక్షణ అవసరమని పేర్కొన్నారు. ఇంకుడు గుంతల నిర్మాణంతో భూగర్భ జలాలు పెరుగుతాయని, మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

వార్డు సభల అనంతరం మహిళలకు మంజూరైన ఇందిరమ్మ చీరలను ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్, మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్, ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఈవార్తలు
# వినోదవాణి
CINEMA
గురువారం 11-6-2026, జగిత్యాల
www.evarthalu.com


వయ్యారి చిత్రం


షకీరా (2)

# ప్రముఖ దర్శకుడు భారతీ రాజా మృతి!

భారతీయ సినీ పరిశ్రమలో ఒక శకం ముగిసింది. తన అద్భుతమైన ప్రతిభతో వెండితెరపై సరికొత్త విప్లవాన్ని సృష్టించిన ప్రముఖ దర్శకుడు, నటుడు భారతీ రాజా (84) ఇక లేరు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, బుధవారం ఉదయం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఈ వార్త వినగానే తమిళ, తెలుగు చిత్ర పరిశ్రమ తీవ్ర దిగ్భ్రాంతికి లోనైంది. ఎందరో నటీనటులను, దర్శకులను పరిచయం చేసిన ఒక గొప్ప గురువుని కోల్పోయామని సినీ లోకం కన్నీరు మున్నీరవుతోంది. భారతీ రాజా గత కొంతకాలంగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్నారు. అయితే, గత ఏడాది ఆయన కుమారుడు మనోజ్ హఠాన్మరణం చెందడం ఆయన్ను మానసికంగా తీవ్రంగా కుంగదీసింది. ఆ పుత్రశోకం నుంచి ఆయన కోలుకోలేకపోయారు. ఇక ఆ ఆవేదనతోనే ఆయన ఆరోగ్యం మరింత క్షీణించింది. బుధవారం ఉదయం పరిస్థితి విషమించడంతో ఆయన కన్నుమూశారు. భారతీ రాజా కేవలం దర్శకుడు మాత్రమే కాదు, సినిమా రూపురేఖలను మార్చిన విప్లవకారుడు. ఇక అప్పటివరకు స్టూడియోలకే పరిమితమైన సినిమాలను, పల్లెటూరి పచ్చదనం వైపు, సహజత్వం వైపు నడిపించిన ఘనత ఆయనదే. ఆయన సినీ ప్రయాణంలో 40కి పైగా చిత్రాలకు దర్శకత్వం వహించి ఎన్నో మైలురాళ్లను అందుకున్నారు. ఆయన ఎక్కువగా తమిళ సినిమాలు తీసినప్పటికీ, తెలుగు ప్రేక్షకులతో ఆయనకు విడదీయరాని బంధం ఉంది. తెలుగులో ఆయన నేరుగా దర్శకత్వం వహించిన 'సీతాకోక చిలుక', 'కొత్త జీవితాలు', 'ఆరాధన', 'జమదగ్ని' వంటి చిత్రాలు సూపర్ హిట్ అయ్యాయి. ముఖ్యంగా 'సీతాకోక చిలుక' సినిమా తెలుగు సినీ చరిత్రలో ఒక క్లాసిక్‌గా నిలిచిపోయింది. చిత్ర పరిశ్రమకు భారతీ రాజా అందించిన నటీనటులు, సాంకేతిక నిపుణులు ఎందరో ఉన్నారు. రాధిక, రాధ, ముచ్చర్ల అరుణ, వంటి స్టార్ నటులను ఆయనే వెండితెరకు పరిచయం చేశారు. అలాగే ఆయన దగ్గర పనిచేసిన ఎందరో శిష్యులు గొప్ప దర్శకులుగా మారారు. మన తెలుగు సీనియర్ దర్శకుడు వంశీ కూడా భారతీ రాజా శిష్యుడే కావడం విశేషం.







# టాలీవుడ్‌లో జాన్వీకి కష్టమే!



స్టార్ హీరోల సరసన నటించే ఛాన్స్ కోసం ఎంతో మంది హీరోయిన్లు ఎదురుచూస్తుంటారు. కానీ బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ కు మాత్రం టాలీవుడ్ లో తొలి రెండు ఛాన్సులు ఎన్టీఆర్, రామ్ చరణ్ వంటి స్టార్ హీరోల పక్కన దక్కాయి. కెరీర్ పరంగా చూస్తే ఇది మంచి స్టార్టింగే. కానీ నటిగా తన టాలెంట్ ప్రూవ్ చేసుకునే విషయంలో మాత్రం ఆమె ఇంకా వెయిటింగ్ స్టేజ్ లో ఉన్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దివంగత అతిలోకసుందరి శ్రీదేవి కుమార్తెగా బాలీవుడ్ లో అడుగుపెట్టిన జాన్వీ కపూర్, తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునేందుకు ట్రై చేస్తున్నారు. హిందీలో విభిన్నమైన కథలు, ఎమోషన్స్ కు ఇంపార్టెన్స్ ఉన్న రోల్స్ చేస్తూ నటిగా తన యాక్టింగ్ తో మంచి మార్కులు సంపాదించారు. అదే సమయంలో తెలుగు ప్రేక్షకుల ముందుకు కూడా వరుస క్రేజీ ప్రాజెక్టులతో వచ్చారు. ఎన్టీఆర్ హీరోగా, కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కిన దేవరతో జాన్వీ టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చారు. భారీ అంచనాల మధ్య విడుదలైన ఆ చిత్రంలో ఆమె తంగం పాత్రలో కనిపించారు. అయితే ఆ రోల్ లో కథలో ఆశించిన స్థాయిలో ఇంపార్టెన్స్ లేకపోవడంతో, జాన్వీ యాక్టింగ్ ను కంప్లీట్ రేంజ్ లో చూసే అవకాశం ప్రేక్షకులకు దక్కలేదు. ఆ తర్వాత రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో వచ్చిన పెద్దిలో ఆమె అచ్చియమ్మ రోల్ చేశారు. ఆ సినిమాపై కూడా అభిమానులు భారీ ఆశలు పెట్టుకున్నారు. కానీ విడుదల తర్వాత మరోసారి జాన్వీ పాత్ర గురించే చర్చ మొదలైంది.



# పూజా కెరీర్ సాగేనా?

ఒకప్పుడు టాలీవుడ్‌లో స్టార్ హీరోలకు ఫస్ట్ ఛాయిస్‌గా నిలిచిన పూజా హెగ్డే ప్రస్తుతం తన కెరీర్‌లో అత్యంత కీలక దశను ఎదుర్కొంటోంది. అల వైకుంఠపురములో లాంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత ఆమె స్థాయి మరింత పెరుగుతుందని అభిమానులు, సినీ వర్గాలు భావించినప్పటికీ, ఆ తర్వాత వచ్చిన ఫలితాలు మాత్రం ఆశించిన స్థాయిలో లేకపోయాయి. ప్రభాస్‌తో చేసిన రాధే శ్యామ్, రామ్ చరణ్‌తో ఆచార్య, సల్మాన్ ఖాన్‌తో కిసీ కా భాయ్ కిసీ కీ జాన్, రణవీర్ సింగ్ సర్కస్, కోలీవుడ్ లో సూర్య తో చేసిన రెట్రో లాంటి సినిమాలు బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచాయి. స్టార్ హీరోలతో వరుసగా అవకాశాలు దక్కినా, వాటిని సక్సెస్‌లుగా మార్చుకోలేకపోవడం ఆమె కెరీర్‌పై ప్రభావం చూపింది. దీంతో సోషల్ మీడియాలో విమర్శలు, ట్రోలింగ్ కూడా పెరిగాయి. అయితే ఈ ఫ్లాపులన్నింటికీ పూజానే బాధ్యత వహించాలా? లేక స్క్రిప్ట్ ఎంపికలు, సినిమా కంటెంట్, మారుతున్న ప్రేక్షకుల అభిరుచులు కూడా కారణమా? అనే చర్చ ఇండస్ట్రీలో కొనసాగుతోంది. గత కొన్నేళ్లుగా ప్రేక్షకులు కేవలం స్టార్ కాస్టింగ్ లేదా గ్లామర్ కంటే బలమైన కథలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు.

# ఇరుముడి కోసం జీవీ స్పెషల్ ట్రీట్

మాస్ మహారాజా రవితేజ కెరీర్ ప్రస్తుతం కీలక దశలో ఉంది. గత కొన్ని రోజులుగా ఆయన నటించిన సినిమాలు ప్రేక్షకులను పూర్తిస్థాయిలో మెప్పించలేకపోయాయి. ఇటీవల విడుదలైన భర్త మహాశయులకు విజ్ఞప్తి సినిమా మంచి రెస్పాన్స్ అందుకున్నప్పటికీ, అది బాక్సాఫీస్ వద్ద భారీ బ్లాక్‌బస్టర్ స్థాయికి చేరుకోలేదు. దీంతో ఇప్పుడు రవితేజ ఆశలన్నీ తన తర్వాతి సినిమా ఇరుముడిపైనే ఉన్నాయి. డైరెక్టర్ శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న ఈ సినిమా అనౌన్స్‌మెంట్ నుంచే ఇండస్ట్రీ వర్గాల్లో ప్రత్యేక చర్చకు దారితీస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్ ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ కానుంది. ఈ సినిమాపై అంచనాలు పెరగడానికి ప్రధాన కారణం దాని కథాంశం, నేపథ్యం అని చెప్పొచ్చు. అయ్యప్ప స్వామి భక్తి, ఆధ్యాత్మికత, యాక్షన్, ఎమోషన్ అంశాలను కలగలిపి శివ నిర్వాణ ఒక విభిన్నమైన కథను సిద్ధం చేసినట్లు టీజర్ చూస్తే అర్థమవుతుంది.






# సాయిపల్లవి నా బెస్ట్ ఫ్రెండ్

దక్షిణాది చిత్ర పరిశ్రమలో తనదైన నటనతో.. చురుకైన పాత్రలతో ప్రేక్షకులను అలరిస్తున్న నటి అనుపమ పరమేశ్వరన్ తన జీవితంలోని ఓ చీకటి అధ్యాయాన్ని.. ఆ సమయంలో తనకు లభించిన ఒక ఆత్మీయ మద్దతును ఇటీవల రివీల్ చేసారు. 2021వ సంవత్సరం తన వ్యక్తిగత – వృత్తిపరమైన జీవితంలో అత్యంత కష్టమైన కాలమని గుర్తు చేసుకున్నారు. ఆ మానసిక ఒత్తిడి నుండి బయట పడటానికి తనలోని సరికొత్త కళాత్మక కోణాన్ని ఆవిష్కరించుకోవడానికి తోటి నటి సాయి పల్లవి ఎలా సహాయపడిందో? అనుపమ వివరించారు. 2021లో ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోవిడ్ పరిస్థితులు.. కెరీర్‌లో ఎదురైన కొన్ని ఒడిదుడుకులు అనుపమను తీవ్రమైన మానసిక ఆందోళనకు గురిచేసాయి. ఆ సమయంలో ఇండస్ట్రీ సహా బయట వ్యక్తులు చాలా మందితో కమ్యూనికేషన్ తెగిపోయింది.

అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో సాయి పల్లవి ఆమెకు అండగా నిలిచారు. ఒక నటిగా కాకుండా మంచి స్నేహితురాలిగా అనుపమ బాధను అర్థం చేసుకుని.. ఆమె మనసును ప్రశాంత పరచడానికి నిరంతరం శ్రమించారని అనుపమ కృతజ్ఞతతో చాటుకున్నారు. మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడానికి ఏదైనా సృజనాత్మక పనిపై దృష్టి పెట్టాలని సాయి పల్లవి ఆమెకు సలహా ఇచ్చారని, అందులో భాగంగానే పెయింటింగ్ అలవాటు చేసుకున్నానని, తర్వాత ప్రశాంతత దొరికిందని చెప్పుకొచ్చింది.







# మరో 4 రోజుల్లో దాయాదుల పోరు

**మహిళా టీ20 ప్రపంచ కప్ 2026 కౌంట్‌డౌన్ మొదలైంది. హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్సీలోని భారత జట్టు తన తొలి మ్యాచ్‌లో పాకిస్థాన్‌తో తలపడనుంది. జూన్ 14న బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో భారత్ తమ పోరాటాన్ని మొదలు పెడుతుంది.**

ఇప్పటివరకు టీ20 ప్రపంచ కప్ గెలవని భారత్, ఈసారి చరిత్ర సృష్టించాలని యోచిస్తోంది. గత కొన్నేళ్లుగా ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా గడ్డపై సిరీస్ విజయాలు సాధించి భారత్ తన సత్తా చాటినప్పటికీ, టోర్నీకి ముందు దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్‌తో జరిగిన సిరీస్‌లలో ఓటమి జట్టు సన్నద్ధతపై కొన్ని ప్రశ్నలను లేవనెత్తింది. భారత్ గ్రూప్ 'ఏ'లో ఉంది. ఇందులో పాకిస్థాన్, నెదర్లాండ్స్, దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్, ఆస్ట్రేలియా వంటి జట్లు ఉన్నాయి. సెమీఫైనల్ చేరుకోవడం సవాలుతో కూడుకున్నది, ఎందుకంటే జట్టులోని పలువురు కీలక ఆటగాళ్లు ఫామ్ లేమితో, కొందరు ఆల్ రౌండర్లు గాయాలతో ఇబ్బంది పడుతున్నారు. భారత జట్టులో షెఫాలీ వర్మ, స్మృతి మంధాన, యాస్తిక భాటియా, జెమీమా రోడ్రిగ్స్, హర్మన్‌ప్రీత్ కౌర్, రిచా ఘోష్, భారతి ఫుల్మాలి, దీప్తి శర్మ, రాధా యాదవ్, అరుంధతి రెడ్డి, శ్రేయంక పాటిల్, శ్రీ చరణి, క్రాంతి గౌడ్, రేణుకా ఠాకూర్, నందిని శర్మ ఉన్నారు. టాప్ ప్లేయింగ్ ఎలెవన్‌లో షెఫాలీ వర్మ, స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్, హర్మన్‌ప్రీత్ కౌర్, రిచా ఘోష్, భారతి ఫుల్మాలి, దీప్తి శర్మ, అరుంధతి రెడ్డి, శ్రీ చరణి, శ్రేయంక పాటిల్/నందిని శర్మ, రేణుకా ఠాకూర్ ఉండే అవకాశం ఉంది. మిడిల్ ఆర్డర్‌లో జెమీమా రోడ్రిగ్స్ బాధ్యత తీసుకోనుంది ఇంగ్లాండ్ కండిషన్స్‌లో 130.25 స్ట్రైక్ రేట్‌తో రాణించిన రికార్డు ఆమెకు ఉంది. 21 ఏళ్ల లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ శ్రీ చరణి బౌలింగ్‌లో 'ఎక్స్ ఫ్యాక్టర్'గా మారవచ్చు. అదే సమయంలో, యాస్తిక భాటియా నెమ్మదైన బ్యాటింగ్, రిచా ఘోష్ ఫామ్ జట్టుకు ఆందోళన కలిగిస్తోంది. స్మృతి మంధాన తన టీ20 అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌లో 4500 పరుగుల మైలురాయిని అందుకోవడానికి మరో 167 పరుగుల దూరంలో ఉన్నారు. అరుంధతి రెడ్డికి 50 టీ20 వికెట్లు పూర్తి చేయడానికి మరో రెండు వికెట్లు కావాలి. జూన్ 21న దక్షిణాఫ్రికాతో జరిగే మ్యాచ్ సెమీస్ అవకాశాలను నిర్ణయించే అత్యంత కీలకమైనదిగా పరిగణించబడుతోంది.

**వరల్డ్ కప్‌లో భారత్ లీగ్ మ్యాచ్‌ల షెడ్యూల్:**

- జూన్ 14: భారత్ వర్సెస్ పాకిస్తాన్, ఎడ్జ్‌బాస్టన్ (బర్మింగ్‌హామ్) - రాత్రి 7:00 గంటలకు
- జూన్ 17: భారత్ వర్సెస్ నెదర్లాండ్స్, హెడింగ్లీ (లీడ్స్) - రాత్రి 7:00 గంటలకు
- జూన్ 21: భారత్ వర్సెస్ సౌతాఫ్రికా, ఓల్డ్ ట్రాఫోర్డ్ (మాంచెస్టర్) - రాత్రి 7:00 గంటలకు
- జూన్ 25: భారత్ వర్సెస్ బంగ్లాదేశ్, ఓల్డ్ ట్రాఫోర్డ్ (మాంచెస్టర్) - రాత్రి 7:00 గంటలకు
- జూన్ 28: భారత్ వర్సెస్ ఆస్ట్రేలియా, లార్డ్స్ (లండన్) - రాత్రి 7:00 గంటలకు

## ఫిఫా సంబురం..

# అంబరాన్నంటేలా వేడుక!

**ఫుట్‌బాల్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న అతిపెద్ద క్రీడా పండుగ, ఫిఫా ప్రపంచకప్ 2026కు రంగం సిద్ధమైంది. భారత కాలమానం ప్రకారం శుక్రవారం నుంచి ఈ మెగా టోర్నమెంట్ ప్రారంభం కానుంది. ఈసారి చరిత్రలో తొలిసారిగా 48 జట్లు టైటిల్ కోసం పోటీ పడుతుండటం విశేషం. అమెరికా, మెక్సికో, కెనడా దేశాలు సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్న ఈ ప్రపంచకప్‌లో మొత్తం 104 మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈసారి టోర్నమెంట్ ఫార్మాట్‌లో కీలక మార్పులు చేశారు.**

గతంలో ఉన్న 8 గ్రూపుల స్థానంలో ఇప్పుడు 12 గ్రూపులను ప్రవేశపెట్టారు. ప్రతి గ్రూపులో నాలుగు జట్లు ఉంటాయి. గ్రూపులోని ప్రతీ జట్టు నుంచి మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్లతో పాటు, మూడో స్థానంలో నిలిచిన ఉత్తమ 8 జట్లు నాకౌట్ దశకు అర్హత సాధిస్తాయి. దీంతో సంప్రదాయ 'రౌండ్ ఆఫ్ 16'కు ముందు కొత్తగా 'రౌండ్ ఆఫ్ 32' దశను కూడా చూడబోతున్నాం. ఈ మార్పుల వల్ల టోర్నమెంట్ మరింత ఆసక్తికరంగా మారింది. ఈ మెగా టోర్నమెంట్‌లో భారత్ పాల్గొననప్పటికీ, దేశవ్యాప్తంగా ఫుట్‌బాల్ అభిమానుల్లో తీవ్రమైన ఆసక్తి నెలకొంది. తమ అభిమాన ఫుట్‌బాల్ స్టార్లు ప్రపంచ వేదికపై తలపడటాన్ని చూసేందుకు ఉత్సాహంగా ఉన్నారు. అయితే, టోర్నమెంట్ ప్రసారాలపై ఇప్పటివరకు నెలకొన్న సందిగ్ధతకు తెరపడింది. భారత ప్రేక్షకులు కూడా మ్యాచ్‌లను ప్రత్యక్షంగా వీక్షించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. భారతదేశంలో ఫిఫా ప్రపంచకప్ 2026 మ్యాచ్‌లను కొత్తగా ప్రారంభించిన 'యునైట్8 స్పోర్ట్స్' నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. మొత్తం నాలుగు ఛానెళ్లలో మ్యాచ్‌లు అందుబాటులో ఉంటాయి. హిందీ కామెంటరీ కోసం 'యునైట్8 స్పోర్ట్స్ 1', 'యునైట్8 స్పోర్ట్స్ 1 హెచ్‌డీ' ఛానెళ్లను చూడవచ్చు. అదేవిధంగా ఇంగ్లీష్ కామెంటరీ కోసం 'యునైట్8 స్పోర్ట్స్ 2', 'యునైట్8 స్పోర్ట్స్ 2 హెచ్‌డీ' ఛానెళ్లు కేటాయించారు. ఇక డిజిటల్ వీక్షకుల కోసం, మ్యాచ్‌ల లైవ్ స్ట్రీమింగ్‌ను 'జీ5' యాప్‌లో అందిస్తున్నారు. ఫుట్‌బాల్ అభిమానులు తమ మొబైల్, ల్యాప్‌టాప్ లేదా స్మార్ట్ టీవీలలో జీ5 యాప్ ద్వారా మ్యాచ్‌లను ప్రత్యక్షంగా వీక్షించవచ్చు.

**టోర్నమెంట్‌లోని గ్రూపుల వివరాలు:**

- గ్రూప్ ఏ: మెక్సికో, దక్షిణాఫ్రికా, రిపబ్లిక్ ఆఫ్ కొరియా, చెకియా
- గ్రూప్ బీ: కెనడా, స్విట్జర్లాండ్, ఖతార్, బోస్నియా అండ్ హెర్జెగోవినా
- గ్రూప్ సీ: బ్రెజిల్, మొరాకో, స్కాట్లాండ్, హైతీ
- గ్రూప్ డీ: యూఎస్ఏ, పరాగ్వే, ఆస్ట్రేలియా, టర్కీ
- గ్రూప్ ఈ: జర్మనీ, ఈక్వెడార్, ఐవరీ కోస్ట్, కురాకో
- గ్రూప్ ఎఫ్: నెదర్లాండ్స్, జపాన్, స్వీడన్, ట్యునీషియా
- గ్రూప్ జీ: బెల్జియం, ఈజిప్ట్, ఇరాన్, న్యూజిలాండ్
- గ్రూప్ హెచ్: స్పెయిన్, ఉరుగ్వే, సౌదీ అరేబియా, కేప్ వెర్డే
- గ్రూప్ ఐ: ఫ్రాన్స్, సెనెగల్, నార్వే, ఇరాక్
- గ్రూప్ జే: అర్జెంటీనా, ఆస్ట్రియా, అల్జీరియా, జోర్డాన్
- గ్రూప్ కే: పోర్చుగల్, కొలంబియా, డీఆర్ కాంగో, ఉజ్బెకిస్థాన్
- గ్రూప్ ఎల్: ఇంగ్లండ్, క్రొయేషియా, ఘనా, పనామా

## టైటిల్ గెలిచే 4 జట్లు ఇవే!

**ఫుట్‌బాల్ ప్రపంచంలోనే అతి పెద్ద పండుగ అయిన ఫిఫా ప్రపంచకప్ 2026 టోర్నీకి రంగం సిద్ధమైంది. మరికొద్ది గంటల్లో ఈ మెగా టోర్నీకి తెరలేవనుంది. అమెరికా, కెనడా, మెక్సికో సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్న ఈ టోర్నీలో తొలిసారి 48 జట్లు పోటీపడుతున్నాయి. దాంతో టైటిల్ ఎవరిని వరిస్తుందనేది ఉత్కంఠగా మారింది. అయితే నాలుగు జట్లకు టైటిల్ గెలిచే అవకాశాలు ఉన్నాయి.**



### అర్జెంటీనా

డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా టైటిల్ రేసులో ముందుంది. 2022 ప్రపంచకప్‌తో పాటు 2024 కోపా అమెరికా విజయాలతో అర్జెంటీనా ఫుట్‌బాల్ క్రీడలోనే ఎదురులేని శక్తిగా ఎదిగింది. కోచ్ లియోనెల్ స్కలోని పర్యవేక్షణలో జట్టు ఒక క్రమశిక్షణ గల కుటుంబంలా పనిచేస్తోంది. జూలియన్ ఆల్వారెజ్, ఎన్జో ఫెర్నాండెజ్, అలెక్సిస్ మ్యాక్ అలిస్టర్ వంటి యువకులు వరల్డ్ క్లాస్ ప్లేయర్లుగా రాణిస్తున్నారు. పెనాల్టీ షూటౌట్‌లలో ప్రత్యర్థులను ఇబ్బంది పెట్టడంలో గోల్ కీపర్ 'ఎమిలియానో' మార్టినెజ్ కీలకం కానున్నాడు. ప్రస్తుతం మెస్సీ వయసు 39 ఏళ్లు. ఆయన ఫిట్‌నెస్‌పై సందేహాలు ఉన్నాయి. అతను జట్టుకు దూరమైతే నడిపించే నాయకుడు ఎవరా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. డిఫెన్స్ ఆటగాళ్ల వయసు పైబడటం కూడా అర్జెంటీనాకు బలహీనతగా మారింది.

### ఫ్రాన్స్

గత రెండు ప్రపంచకప్‌ల్లోనూ ఫైనల్స్ చేరడం ద్వారా ఫ్రాన్స్ తన ఆధిపత్యాన్ని చాటుకుంది. స్టార్ ఆటగాడు కైలియన్ ఎంబాప్పే నాయకత్వంలో ఈసారైనా టైటిల్ అందుకోవాలనే పట్టుదలతో ఉంది. ఫ్రాన్స్ జట్టుకు గల అతిపెద్ద బలం బెంచ్ స్ట్రెంత్. ఒక ఆటగాడు అందుబాటులో లేకున్నా.. అతనికి సమానమైన నైపుణ్యం కలిగిన మరో ముగ్గురు సిద్ధంగా ఉంటారు. వారి మెరుపు వేగంతో కూడిన కౌంటర్ అటాక్‌లు ఏ రక్షణ విభాగిన్నైనా ఛేదించగలవు. అయితే, గ్రీజ్మాన్ వంటి అనుభవం గల క్రీడాకారులు జట్టుకు దూరమైతే ఆ స్థానాన్ని భర్తీ చేయడం సవాలుగా మారవచ్చు. అలాగే, జట్టులో అంతర్గత సమన్వయం, కోచింగ్ సిబ్బందితో ఉండే సంబంధాలు ప్రదర్శనను ప్రభావితం చేసే అవకాశం ఉంది.





### బ్రెజిల్

గత రెండు దశాబ్దాలుగా వరల్డ్ కప్ గెలవని బ్రెజిల్.. యువ ప్రతిభావంతులతో మళ్ళీ పుంజుకుంటోంది. వినీషియస్ జూనియర్, రోడ్రిగో ప్రస్తుతం ప్రపంచంలోని అత్యుత్తమ వింగర్లుగా నిలిచారు. వీరితో పాటు యువ సంచలనం ఎండ్రిక్ జత కలవడం జట్టుకు అదనపు బలాన్ని ఇస్తుంది. అయితే, నాకౌట్ దశలలో ఐరోపా జట్లతో ఆడేటప్పుడు బ్రెజిల్ తరచుగా తడబడుతుంటుంది. ముఖ్యమైన సమయాల్లో ఒత్తిడిని తట్టుకోవడం వారికి ప్రధాన సవాలు. అదనంగా, జట్టులో అచ్చమైన 'ప్లేమేకర్' లోపం స్పష్టంగా కనిపిస్తోంది. నెయ్మార్ అందుబాటులో ఉన్నా.. గాయాల కారణంగా ఆయన పూర్తిస్థాయిలో రాణిస్తారా అనే సందేహంగా మారింది.



### స్పెయిన్

యూరో 2024 విజేతగా నిలిచిన స్పెయిన్.. హాట్ ఫేవరేట్‌గా బరిలోకి దిగుతోంది. తమ సాంప్రదాయ 'టికి టాకా' ఆటతీరు నుంచి బయటకు వచ్చి, వేగవంతమైన, అటాకింగ్ గేమ్‌ను అలవర్చుకున్నారు. లామిన్ యమల్, నికో విలియమ్స్ వంటి యువ వింగర్లు జట్టు స్వరూపాన్నే మార్చేశారు. రోడ్రి నాయకత్వంలో మిడ్‌ఫీల్డ్ విభాగం అత్యంత బలంగా ఉంది. అయితే, కోల్పోయిన అవకాశాలను గోల్స్‌గా మలచడంలో స్పెయిన్ అప్పుడప్పుడు విఫలమవుతోంది. ఒక క్లినికల్ ఫినిషర్ లేకపోవడం వారికి ప్రధాన లోపం. అలాగే, ప్రపంచకప్ వంటి మెగా టోర్నీ ఒత్తిడిని యువ ఆటగాళ్లు ఎలా ఎదుర్కొంటారనేది వేచి చూడాలి. ఉత్తర అమెరికా ఖండంలో జరగనున్న ఈ టోర్నీలో వాతావరణ పరిస్థితులు, సుదీర్ఘ ప్రయాణాలు ఆటగాళ్లపై ప్రభావం చూపవచ్చు. అర్జెంటీనా, ఫ్రాన్స్, బ్రెజిల్, స్పెయిన్ జట్లు అగ్రపథంలో ఉన్నప్పటికీ.. ఇంగ్లండ్, పోర్చుగల్, జర్మనీ వంటి జట్లు కూడా కప్పు గెలిచే సత్తా కలిగి ఉన్నాయి. 2026 ప్రపంచకప్ ఫుట్‌బాల్ అభిమానులకు ఖచ్చితంగా ఒక గొప్ప విందు కానుంది.



నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial




# ఆటలు.. ప్రతి ఒక్కరి హక్కు

**(నేడు అంతర్జాతీయ ఆటల దినోత్సవం)**

క్రీడలు వ్యక్తిత్వ నిర్మాణం, సమాజ సమగ్రతకు పునాది వంటివి. క్రీడలు శారీరక ఆరోగ్యాన్ని మాత్రమే కాదు, మానసిక స్థైర్యాన్ని కూడా పెంపొందిస్తాయి. ప్రస్తుత కాలంలో యువత డిజిటల్ ప్రపంచంలో ఎక్కువగా మునిగిపోతున్న పరిస్థితిలో, క్రీడల ప్రాధాన్యం మరింత పెరిగింది. ఆటలు వ్యక్తిని క్రమశిక్షణకు, సహనానికి, జట్టు భావానికి దగ్గర చేస్తాయి. గెలుపు ఓటములను సమానంగా స్వీకరించే మనస్తత్వాన్ని క్రీడలే నేర్పుతాయి. అంతేకాక, క్రీడలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయి. భాష, మతం, ప్రాంతం అనే భేదాలను దాటి ఒకే మైదానంలో ఆటగాళ్లు పోటీ పడటం మానవతా విలువలకు ప్రతీకగా నిలుస్తుంది. ఒలింపిక్స్ వంటి అంతర్జాతీయ క్రీడా వేదికలు ఈ ఐక్యతకు ఉత్తమ ఉదాహరణలు. భారతదేశంలో కూడా క్రీడలకు ప్రాధాన్యం పెరుగుతున్నప్పటికీ, ఇంకా గ్రామీణ స్థాయిలో మౌలిక సదుపాయాల కొరత ఉంది. ప్రతిభ ఉన్నా అవకాశాలు లేని అనేక మంది యువ క్రీడాకారులు మన సమాజంలో కనిపిస్తారు. ప్రభుత్వం, ప్రైవేట్ రంగం కలిసి క్రీడా మౌలిక వసతులను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. పాఠశాల స్థాయి నుంచే క్రీడలను తప్పనిసరి చేయడం, మంచి కోచ్‌లను అందించడం, క్రీడాకారులకు ఆర్థిక భద్రత కల్పించడం ద్వారా మాత్రమే దేశం అంతర్జాతీయ వేదికలపై మరింత మెరుగైన ప్రతిభను చూపిస్తుంది. క్రీడలు మనుషులను శారీరకంగా బలంగా మాత్రమే కాకుండా, నైతికంగా కూడా బలంగా మారుస్తాయి. అందుకే ప్రతి యువకుడు కనీసం ఒక ఆటలోనైనా చురుకుగా పాల్గొనడం అవసరం. "ఆటలతో ఆరోగ్యం – ఆరోగ్యంతో అభివృద్ధి" అనే సందేశాన్ని ఆచరణలో పెట్టినప్పుడే నిజమైన క్రీడా స్ఫూర్తి సాకారమవుతుంది.



తెలంగాణ రాజకీయాలు సాధారణ ఎన్నికల పోటీగా మాత్రమే చూడలేని ప్రత్యేకతను కలిగి ఉన్నాయి. ఇక్కడి రాజకీయ ప్రవాహం ఎప్పటికప్పుడు మారుతున్నప్పటికీ, దాని లోతుల్లో ఒక స్థిరమైన భావోద్వేగ శక్తి పనిచేస్తూనే ఉంటుంది. అదే తెలంగాణ సెంటిమెంట్. ఉద్యమ కాలంలో రూపుదిద్దుకున్న ఈ భావన రాష్ట్రం సాధించిన తర్వాత కూడా పూర్తిగా తగ్గిపోలేదు. పైగా, అది కొత్త రాజకీయ సమీకరణాల్లో మరింత సున్నితమైన, ప్రభావవంతమైన రూపాన్ని తీసుకుంది.

# తెలంగాణ సెంటిమెంట్.. సామాజిక వాస్తవం

తెలంగాణ ఉద్యమం ఒక ప్రాంతీయ అసంతృప్తి నుంచి ప్రారంభమై, చివరికి ఒక రాష్ట్ర సాధన ఉద్యమంగా రూపాంతరం చెందింది. ఆ క్రమంలో ప్రజలలో ఏర్పడిన భావన కేవలం రాజకీయ లక్ష్యాలకు పరిమితం కాలేదు. అది తమ ప్రాంతం పట్ల గౌరవం, తమ హక్కుల పట్ల అవగాహన, తమ భవిష్యత్తుపై ఆశలను కల్పించింది. ఈ భావనను రాజకీయ పార్టీలు అర్థం చేసుకున్న తీరే వారి భవిష్యత్తు ను నిర్ణయించింది. ఉద్యమ సమయంలో ఈ సెంటిమెంట్‌ను సమర్థంగా వినియోగించిన పార్టీ, రాష్ట్రం ఏర్పడిన తర్వాత దీర్ఘకాలం అధికారంలో కొనసాగింది. అయితే కాలక్రమంలో రాజకీయ వ్యూహాలు మారడం, జాతీయ స్థాయిలో విస్తరించే ప్రయత్నాలు చేయడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ మార్పులు కొంతవరకు ప్రజల దృష్టిలో ఆ పార్టీని ఉద్యమ స్ఫూర్తి నుంచి దూరం చేశాయన్న భావనను కూడా కలిగించాయి. అదే రాజకీయంగా ప్రతికూల ఫలితాలకు దారి తీసిన అంశాల్లో ఒకటిగా విశ్లేషించబడుతుంది. తెలంగాణ రాజకీయాల్లో మరో ముఖ్యమైన పరిణామం కాంగ్రెస్ పునరాగమనం. ఈ పార్టీ తిరిగి బలపడటానికి కారణం కేవలం ప్రతిపక్ష వ్యతిరేకత మాత్రమే కాదు. ఉద్యమ సెంటిమెంట్‌ను పూర్తిగా వ్యతిరేకించకుండా, దాన్ని ఒక స్థాయిలో గౌరవించడం, అదే సమయంలో సంక్షేమ హామీలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం దీనికి ప్రధాన కారణంగా కనిపిస్తుంది. తెలంగాణ ఓటరు భావోద్వేగంతో పాటు ఆచరణాత్మక సమస్యలపైనా స్పందిస్తాడు అన్న వాస్తవాన్ని కాంగ్రెస్ వ్యూహం కొంతవరకు అర్థం చేసుకున్నట్లు కనిపించింది. ఫలితంగా రాష్ట్ర రాజకీయాల్లో కొత్త సమతుల్యం ఏర్పడింది. ఇక జాతీయ పార్టీగా బీజేపీకి తెలంగాణలో ఎదురవుతున్న పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. జాతీయ స్థాయిలో ఉన్న బలం ఇక్కడ నేరుగా ఓట్లుగా మారడం లేదు. తెలంగాణ రాజకీయ వాతావరణం పూర్తిగా స్థానిక భావోద్వేగాలపై ఆధారపడి ఉండటమే దీనికి ప్రధాన కారణం. ఇక్కడ ప్రజలు అభివృద్ధి అంశాలను మాత్రమే కాకుండా, ప్రాంతీయ గౌరవం, చరిత్ర, ఉద్యమ నేపథ్యం వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. అందువల్ల జాతీయ రాజకీయాల ప్రభావం కొన్ని సందర్భాల్లో స్థానికంగా ప్రతికూలంగా మారే అవకాశముంది. ప్రత్యేకించి ఇతర రాష్ట్రాల రాజకీయాలతో ఉన్న అనుబంధాలు, లేదా ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై ఉన్న అభిప్రాయాలు తెలంగాణలో సున్నితమైన ప్రతిస్పందనలకు దారి తీసే అవకాశం ఉంటుంది. ఇది రాజకీయ నాయకుల ఉద్దేశం కాకపోయినా, ప్రజల గ్రహింపు రాజకీయాల్లో చాలా కీలక పాత్ర పోషిస్తుంది. తెలంగాణ రాజకీయాల్లో "ద్రోహి" వంటి భావోద్వేగ పదాలు కూడా అప్పుడప్పుడు వినిపిస్తాయి. ఇవి శాశ్వత రాజకీయ నిర్వచనాలు కావు. ఎన్నికల సమయంలో ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచడానికి ఉపయోగించే భావోద్వేగ భాషగా మాత్రమే వీటిని చూడాలి. కానీ ఈ భావోద్వేగాన్ని తక్కువగా అంచనా వేయడం కూడా రాజకీయంగా ప్రమాదకరం. ఎందుకంటే తెలంగాణలో భావోద్వేగం ఇంకా పూర్తిగా తగ్గని శక్తిగా ఉంది. అది ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే స్థాయిలో కొనసాగుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణ రాజకీయాలు ప్రధానంగా మూడు శక్తుల మధ్య కేంద్రీకృతమై ఉన్నాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ–ఈ మూడు పార్టీల భవిష్యత్తు ఒకే ప్రశ్నపై ఆధారపడి ఉంది.. అదే తెలంగాణ సెంటిమెంట్‌ను ఎవరు ఎంత లోతుగా అర్థం చేసుకుంటారు అన్నది. ఈ సెంటిమెంట్‌ను పూర్తిగా విస్మరించినా ప్రమాదమే, అతిగా ఉపయోగించినా ప్రమాదమే. సమతుల్యంగా అర్థం చేసుకోవడం మాత్రమే రాజకీయ స్థిరత్వానికి మార్గం. తెలంగాణ ఓటరు గతంలో కంటే ఇప్పుడు మరింత అవగాహన కలిగి ఉన్నప్పటికీ, భావోద్వేగానికి అతీతం కాలేదు. అభివృద్ధి, సంక్షేమం, ఉద్యోగాలు వంటి అంశాలు ఎంత ముఖ్యమైనవో, తమ రాష్ట్ర గౌరవం కూడా అంతే కీలకమని భావించే వాతావరణం ఇంకా కొనసాగుతోంది. అందుకే ఇక్కడి రాజకీయాలు కేవలం విధానాల పోటీ కాదు, భావోద్వేగాల సమతుల్యం కూడా. తెలంగాణ సెంటిమెంట్ అనేది తాత్కాలిక రాజకీయ సాధనం కాదు. అది ఒక సామాజిక వాస్తవం. కాలంతో దాని రూపం మారవచ్చు, తీవ్రత మారవచ్చు, కానీ దాని ఉనికి పూర్తిగా తగ్గదు. రాజకీయ పార్టీలు ఈ వాస్తవాన్ని ఎంత త్వరగా అర్థం చేసుకుంటే, వారి భవిష్యత్తు అంత స్థిరంగా ఉంటుంది. లేకపోతే, తెలంగాణ రాజకీయాల్లో చరిత్ర పదేపదే ఒకే పాఠాన్ని పునరావృతం చేస్తూనే ఉంటుంది.



**చింత రామస్వామి**
మహబూబ్‌నగర్

# అమిత్ షాకు అర్థమైంది!



తెలంగాణ రాజకీయాల్లో పొత్తుల సమీకరణాలు ఎప్పుడూ సులభంగా పని చేయవు. రాష్ట్ర ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు జరిగిన ఎన్నికల గమనాన్ని పరిశీలిస్తే, ఇక్కడి ఓటరు నిర్ణయాలు కేవలం అంకగణిత రాజకీయాలపై ఆధారపడవని స్పష్టమవుతుంది. స్థానిక భావోద్వేగం, ప్రాంతీయ గుర్తింపు, అభ్యర్థుల పట్ల వ్యక్తిగత స్వీకారం, అలాగే జాతీయ పార్టీలపై ఉన్న అభిప్రాయాలు.. కలిసి ఓటింగ్ ధోరణిని ప్రభావితం చేస్తాయి. ఈ నేపథ్యంలో పొత్తుల రాజకీయాలు ఆశించిన స్థాయిలో ఫలితాలను ఇవ్వలేకపోయిన అనుభవం అనేక పార్టీలకు ఉంది. ఈ పరిణామాల మధ్య కేంద్రంలోని బీజేపీ నాయకత్వం, ముఖ్యంగా అమిత్ షా వ్యూహాత్మకంగా తెలంగాణ రాజకీయ పరిస్థితిని మరోసారి సమీక్షించినట్టు కనిపిస్తుంది. రాష్ట్రంలో పొత్తుల ద్వారా ఎన్నికల్లోకి వెళ్తే, స్థానిక స్థాయిలో సమీకరణాలు అనుకూలంగా మారవన్న అభిప్రాయం పార్టీ అంతర్గత చర్చల్లో బలపడినట్టు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ఒంటరిగా పోటీ చేయడం ద్వారా తమ ఓటు బ్యాంకును స్వతంత్రంగా పరీక్షించుకోవడం, అలాగే భవిష్యత్‌లో బలమైన రాజకీయ స్థావరాన్ని నిర్మించుకోవడం అనే వ్యూహాత్మక దృక్పథం ముందుకు వచ్చినట్టు అర్థం అవుతోంది.

తెలంగాణలో పొత్తుల రాజకీయాలు గతంలో కూడా మిశ్రమ ఫలితాలనే ఇచ్చాయి. కొన్ని సందర్భాల్లో పొత్తులు సంఖ్యాపరంగా ప్రయోజనం కలిగించినా, భావోద్వేగ స్థాయిలో ఓటర్లను పూర్తిగా ఆకర్షించలేకపోయాయి. ముఖ్యంగా ప్రాంతీయ భావన బలంగా ఉన్న రాష్ట్రంలో, ప్రతి పార్టీకి ఉన్న ప్రత్యేక గుర్తింపు కీలకంగా మారుతుంది. పొత్తుల వల్ల ఆ గుర్తింపు మసకబారే ప్రమాదం కూడా ఉంటుంది. ఇదే కారణంగా అనేక సందర్భాల్లో ఓటరు "ఎవరి పార్టీకి ఓటు వేస్తున్నాం" అన్న స్పష్టతలో అయోమయం చెందే అవకాశం ఉంటుంది. ఈ అయోమయం చివరికి ఓట్ల విభజనకు దారితీసి, అంచనాలు తప్పే పరిస్థితులు ఏర్పడతాయి. ఇలాంటి అనుభవాల నేపథ్యంలో బీజేపీ వ్యూహకర్తలు తెలంగాణలో స్వతంత్రంగా బరిలోకి దిగడం ద్వారా పార్టీ బలం, బలహీనతలను నేరుగా అంచనా వేయవచ్చని భావిస్తున్నట్టు తెలుస్తోంది. పొత్తుల వల్ల వచ్చే తాత్కాలిక లాభాల కంటే, దీర్ఘకాలికంగా పార్టీని నిర్మించుకోవడం ముఖ్యమని షా భావిస్తున్నారు. ముఖ్యంగా రాష్ట్రంలో బలమైన ప్రాంతీయ పార్టీల ఉనికి, భావోద్వేగ రాజకీయాల ప్రభావం, అలాగే స్థానిక నాయకత్వంపై ఆధారపడే ఓటింగ్ ధోరణి.. ఇవన్నీ కలిసి బీజేపీకి సవాలుగా మారుతున్నాయి. తెలంగాణ ఓటరు ప్రవర్తనను గమనిస్తే, జాతీయ స్థాయి రాజకీయ నినాదాల కంటే స్థానిక సమస్యలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నట్టు కనిపిస్తుంది. ఉద్యోగాలు, నీటి వనరులు, రైతు సమస్యలు, పట్టణ అభివృద్ధి వంటి అంశాలు ఓటు నిర్ణయాన్ని ప్రభావితం చేస్తున్నాయి. ఈ సందర్భంలో పొత్తుల ద్వారా వచ్చే "సామూహిక ప్రచారం" కంటే, ప్రతి పార్టీ తన స్వతంత్ర విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం ఎక్కువ ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. ఇదే కారణంగా ఒంటరి పోటీ వ్యూహం ద్వారా పార్టీకి స్పష్టమైన గుర్తింపు తీసుకురావాలన్న ఆలోచన బలపడుతోంది. అయితే, ఒంటరి పోటీ అనేది సులభమైన మార్గం కాదు. ఇది ఒక పార్టీ నిజమైన బలం పరీక్షించే వేదికగా మారుతుంది. పొత్తుల ద్వారా దాగిన బలహీనతలు బయటపడే అవకాశం ఉంటుంది. అదే సమయంలో బలమైన ప్రాంతీయ పార్టీలు ఉన్న రాష్ట్రంలో ఒంటరిగా పోటీ చేయడం అంటే గట్టి రాజకీయ యుద్ధానికి సిద్ధపడటం వంటిదే. కానీ దీర్ఘకాలిక దృష్టితో చూస్తే, ఇది పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి సహాయపడే వ్యూహంగా కూడా భావించవచ్చు. తెలంగాణ రాజకీయాల్లో మరో ముఖ్యమైన అంశం భావోద్వేగం. ఇక్కడ రాజకీయ నిర్ణయాలు పూర్తిగా గణితంపై ఆధారపడవు. చరిత్ర, ఉద్యమ నేపథ్యం, ప్రాంతీయ గౌరవం వంటి అంశాలు ఓటరు మనసులో గాఢంగా నాటుకుపోయి ఉన్నాయి. ఈ నేపథ్యంలో పొత్తుల రాజకీయాలు కొన్నిసార్లు "బాహ్య ప్రభావం"గా పరిగణించబడే ప్రమాదం ఉంటుంది. అందువల్ల ప్రతి పార్టీ తన స్వతంత్ర గుర్తింపును నిలబెట్టుకోవడం చాలా కీలకం. ఈ పరిణామాలన్నింటి నేపథ్యంలో బీజేపీ ఒంటరి పోటీ దిశగా అడుగులు వేస్తుందన్న సంకేతాలు తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీస్తున్నాయి. ఇది కేవలం ఎన్నికల వ్యూహం మాత్రమే కాదు, భవిష్యత్ రాజకీయ నిర్మాణానికి సంబంధించిన నిర్ణయంగా కూడా చూడాల్సి ఉంటుంది. పొత్తుల రాజకీయాల నుంచి దూరంగా ఉండటం ద్వారా పార్టీ తన స్వంత ఓటు బలాన్ని అంచనా వేసుకోవడంతో పాటు, భవిష్యత్‌లో అవసరమయ్యే వ్యూహాత్మక మార్పులకు మార్గం సుగమం చేసుకోవచ్చు. మొత్తంగా చూస్తే, తెలంగాణలో పొత్తుల రాజకీయాలు ఎప్పుడూ హామీ ఇచ్చే విజయ మార్గం కాలేదు. ఇక్కడ విజయం సాధించాలంటే భావోద్వేగం, స్థానిక సమస్యల అవగాహన, స్థిరమైన రాజకీయ గుర్తింపు.. కలిపి ఉండాలి. ఈ సమీకరణాన్ని అర్థం చేసుకుని ముందుకు వెళ్లే పార్టీ మాత్రమే ఇక్కడ నిలదొక్కుకుంటుంది.



**శశిధర్ అక్కెల**
జగిత్యాల జిల్లా

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.